PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 96 | విజయవాడ, సోమవారం 7 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 7 November 2022 | Rs

విశాఖ ఉక్కుకై ఆత్మగౌరవ పోరాటం

- మోడీ పర్యటన సందర్భంగా నిరసనలు
- ఉక్కు పోరాట వేదిక పిలుపు

● లోపలి పేజీలో.. ●



చితక్కొట్టి సెమీస్‌కు..

జింబాబ్వేపై భారత్ ఘన విజయం

కాప్-27 సదస్సు ప్రారంభం

ఎజెండాలో వాతావరణ పరిహారం



కాప్ 27 సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తున్న ఐరాస వాతావరణ ప్యానెల్ చీఫ్ హోసంగ్ లీ

కైరో : ఈజిప్టులోని షర్మ్ ఎల్-షేక్‌లో ఐక్యరాజ్య సమితి 27వ వాతావరణ సదస్సు (కాప్ 27) ఆదివారం ప్రారంభమైంది. ఈ నెల 18 వరకూ ఈ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో తొలిసారిగా వాతావరణ పరిహార అంశాన్ని ఎజెండాలో చేర్చారు. దీనితో వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్‌తో బాధపడుతున్న పేద దేశాలకు ధనిక దేశాలు పరిహారం ఇచ్చే విషయంపై ప్రతినిధులు చర్చించనున్నారు. ఈ విషయాన్ని ప్రారంభ సెషన్‌లో కాప్ 27 అధ్యక్షులు, ఈజిప్టు పర్యావరణ మంత్రి సమేహ్ షౌక్రి వెల్లడించారు. వాతావరణ పరిహారాన్ని ఈ ఏడాది ఎజెండాలో చేర్చడం వాతావరణ విపత్తుల బాధితుల కోసం సంఘీభావాన్ని ప్రతిబింబిస్తుందని షౌక్రి అన్నారు. వాతావరణ పరిహారాన్ని ఎజెండాలో చేర్చేందుకు సదస్సు ప్రారంభానికి కొన్ని గంటల ముందు ఆమోదం లభించిందని తెలిపారు. ఐరాస వాతావరణ ప్యానెల్ చీఫ్ హోసంగ్ లీ సదస్సు ప్రారంభోపన్యాసంలో గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి కృషి చేయడం, గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలకు అనుగుణంగా జీవించడం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. మన గ్రహాన్ని, మన జీవనోపాధిని కాపాడుకోవడానికి ఒక తరానికి ఒకసారి మాత్రమే అవకాశం వస్తుందని అన్నారు. బ్రిటిష్ అధికారి అలోక్ శర్మ మాట్లాడుతూ పాకిస్తాన్, నైజీరియాలో ఇటీవల సంభవించిన వినాశకరమైన వరదలు, యూరప్, అమెరికాలో చైనాలో చారిత్రాత్మక కరువులను ప్రస్తావిస్తూ ప్రపంచ నాయకులకు, ప్రపంచానికి ఇంకా ఎన్ని మేల్కొలుపులు అవసరమని తీవ్రంగా ప్రశ్నించారు. సదస్సు ప్రారంభం సందర్భంగా ఆతిథ్య దేశం ఈజిప్టు అధ్యక్షులు అబ్దెల్ ఫట్టా ఎల్-సిస్సి 'ప్రతిజ్ఞల దశ నుంచి క్షేత్రస్థాయిలో నిర్దిష్ట చర్యలతో ఇంప్లాంటేషన్ దశకు వెళ్లాలని' కోరుకుంటున్నట్లు ట్వీట్ చేశారు. సదస్సుకు 120 మందికి పైగా ప్రపంచ నాయకులు హాజరుకానున్నారు. వీరిలో ఎక్కువ మంది ఈ నెల 7-8 తేదీల్లో ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో మాట్లాడతారు.

నిరసనపై ఉక్కుపాదం

వాతావరణ సదస్సు సందర్భంగా నిరసనలపై ఈజిప్టు ఉక్కుపాదం మోపిందని హక్కుల సంఘాలు ఆదివారం ఆరోపించాయి. శిఖరాగ్ర సమావేశంలో నిఘాను పెంచాయని విమర్శించాయి. నిరసనలకు పిలుపునిచ్చినందుకు వందల సంఖ్యలో ఆందోళనకారుల్ని అధికారులు అరెస్టు చేశారని న్యూయార్క్‌కు చెందిన హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది.

తెలంగాణ భవనంలో టిఆర్‌ఎస్ పార్టీ సంబరాలు



మునుగోడులో కారు జోరు

- ఓడిన బిజెపి
- డిపాజిట్ దక్కని కాంగ్రెస్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మునుగోడులో బిజెపి పాచికలు పారలేదు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో రాజీనామా చేయించి ఏదోవిధంగా ఉప ఎన్నికలో విజయం సాధించాలనుకున్న కమలనాధులకు దిమ్మతిరిగేలా ఫలితం వచ్చింది. కమ్యూనిస్టుల సహకారంతో టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమీప బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై 10,307 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. టిఆర్‌ఎస్‌కు 97,003, బిజెపికి 86,696 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి 23,864 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. బిఎస్‌పి 4,145 ఓట్లు మాత్రమే తెచ్చుకుంది. మునుగోడులో జోరుగా ప్రచారం చేసిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్‌కు 805 ఓట్లు పోలయ్యాయి.

నోటాకు 482 ఓట్లు వచ్చాయి. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు నల్గొండ గిడ్డంగుల శాఖ గోదాములో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొత్తం 15 రౌండ్లు ఓట్లు లెక్కింపు జరగ్గా రెండో రౌండు, మూడో రౌండు మినహా మిగిలిన 13 రౌండ్లలోనూ టిఆర్‌ఎస్ ఆధిక్యం కనబర్చింది. స్వల్ప మెజార్టీలు నమోదవుతుండడంతో రౌండ్‌రౌండ్‌కూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పట్టణ ప్రాంతాలైన చౌటుప్పల్, చండూరుపై బిజెపి పెట్టుకున్న అంచనాలు తారుమారయ్యాయి. అక్కడ కూడా టిఆర్‌ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ రావడంతో పదో రౌండ్‌కే బిజెపి ఆశలు వదులుకుంది. ఐదో రౌండ్ తర్వాత బిజెపి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. ఫలితాలను ఆలస్యంగా ప్రకటిస్తున్నారని ఎన్నికల సంఘం అధికారులపై బిజెపి నాయకులు పలు ఆరోపణలు చేశారు.

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన రోజు నుంచే మునుగోడు ఉప ఎన్నిక తెలుగు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఎం కెసిఆర్... మునుగోడులో బలమైన క్యాడర్ ఉన్న వామపక్షాల సహకారం తీసుకున్నారు. కేంద్రంలోని బిజెపి మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలను వామపక్ష కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వివరించారు. ఫలితాల అనంతరం టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడుతూ టిఆర్‌ఎస్ గెలుపులో ముఖ్యపాత్ర పోషించిన వామపక్ష నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఆల్ ఫేక్ పార్టీ బిజెపికి కర్రుకాల్చి వాత పెట్టిన మునుగోడు ప్రజల చైతన్యానికి శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నానని పేర్కొన్నారు. మునుగోడులో టిఆర్‌ఎస్ విజయం రాష్ట్ర రాజకీయాల్లో మంచి పరిణామమని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఈ ఫలితం బిజెపికి చెంపపెట్టులాంటిదని తెలిపారు. టిఆర్‌ఎస్, కమ్యూనిస్టుల కలయికే ఈ విజయానికి ప్రధాన కారణమని చెప్పారు. టిఆర్‌ఎస్ విజయంతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంబరాలు మిన్నంటాయి. నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టపాసులు, తీన్మార్ దరువులతో తెలంగాణ భవన్ మార్మోగింది.

ధాన్యం కొనుగోలు ఎప్పుడు?

ప్రారంభమైన ఖరీఫ్ కోతలు

పూర్తి కాని సిఎంఆర్ ట్యాగింగ్ ప్రక్రియ



ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఇంకా ప్రారంభం కాలేదు. ఏ తేదీ నుండి ప్రారంభమవుతుందనే దానిపై స్పష్టత లేదు. కాకినాడ జిల్లాలో గండేపల్లి, జగ్గంపేట, పెదపూడి, కిర్లంపూడి, ఏలేశ్వరం, కోటనందూరు తదితర మండలాల్లో వరి కోతలు ఇప్పటికే మొదలయ్యాయి. కొన్నిచోట్ల కోతలు పూర్తయ్యాయి కూడా. మరో వారం పది రోజుల్లో దాదాపు జిల్లా అంతటా పూర్తి స్థాయిలో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. గండేపల్లి మండలంలో రెండు వారాల క్రితమే కోతలు మొదలవగా 40 శాతం పూర్తయ్యాయి. మరో నాలుగైదు రోజుల్లో ఈ మండలంలో వరి కోతలు మొత్తం పూర్తి కానున్నాయి. ఎ-గ్రేడ్‌కు రూ.2,060, సాధారణ రకం రూ.2,040 చొప్పున మద్దతు ధర చెల్లించి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాల్సి ఉంది. కొనుగోళ్లు ఇంకా ఎక్కడా ప్రారంభం కాకపోవడంతో ఈ మండలంలో పలువురు రైతులు 75 కేజీలు బస్తాను రూ.1,400కే అమ్ముకోవాల్సి వస్తోంది. మద్దతు ధర ప్రకారం 75 కేజీలకు రూ.1,545 రావాలి. బస్తా వద్ద రైతులు రూ.145 వరకూ నష్టపోతున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనందున తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

ధాన్యం సేకరణపై స్పష్టత కరువు

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రశ్నార్థకంగా మారింది. నవంబరు మొదటి వారం నుంచే సేకరణ చేయాలని అధికారులు తొలుత భావించారు. కాని అమల్లోకి రాలేదు. రెండు లేదా మూడో వారం నుంచి సేకరించేందుకు సమాయత్తమవుతున్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో కీలకమైన కస్టమ్ రైస్ మిల్లింగ్ (సిఎంఆర్)కు నిర్దేశించిన రైస్ మిల్లులు బ్యాంకు గ్యారంటీలు నేటికీ సమర్పించలేదు. వాస్తవానికి ఈ ప్రక్రియను ముందుగానే పూర్తి చేసి ఆర్‌బికెలకు ఆయా రైస్ మిల్లులను ట్యాగింగ్ చేయాలి. ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందనే దానిపై స్పష్టత లేదు.

మిల్లర్లకు బకాయిలు

జిల్లాలోని రైస్ మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.425 కోట్లు బకాయి ఉంది. అవి ఎప్పుడు ఇస్తుందో సర్కారు స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వలేమని, ధాన్యం రవాణా ఖర్చులు, మిల్లింగ్ ఛార్జీలు, గోనె సంచుల డబ్బులు ఇవ్వాలని మిల్లర్లు అడుగుతున్నారు. ఒక మిల్లుకు ఎంత ధాన్యం ఇస్తున్నారో దాని ఖరీదుకు సరిపడా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీని ప్రకారం 1:1 నిష్పత్తిలో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వలేమని మిల్లర్లు తేల్చి చెబుతున్నారు. ఈ సమస్యల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు.

సేకరణ లక్ష్యం 46.3 శాతమే ...

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.37 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 4.95 లక్షల టన్నులు మార్కెట్‌కు వస్తాయి. ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం 2.55 లక్షల టన్నులకు మాత్రమే పరిమితమైంది. అంటే మొత్తం ఉత్పత్తయ్యే దానిలో 46.3 శాతం మాత్రమే సేకరిస్తే మిగతాది ప్రైవేటు వారి దాయాదాక్షిణ్యాలపై రైతులు అమ్ముకోవాలి.

ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య రంగం

- ప్రజలకు ఉచితంగా సేవలందాలి
- ప్రజారోగ్య వేదిక సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ శ్యాం ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య రంగం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండాలని ప్రజారోగ్య వేదిక నిర్వహించిన సదస్సులో వక్తలు అన్నారు. అప్పుడే ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ప్రజల వైద్యానికి అయ్యే ఖర్చులను తగ్గించాలని కోరారు. ప్రజారోగ్య వేదిక అధ్యక్షులు రమణయ్య అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఆరోగ్య సదస్సు ఆదివారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమాన్ని వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యాధి నివారణ చర్యలు తీసుకుంటే ఆరోగ్య వ్యవస్థపై 70శాతం భారం తగ్గుతుందని చెప్పారు. ప్రజల వైద్య ఖర్చు కూడా అదే మోతాదులో తగ్గుతుందన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన విలేజ్ హెల్త్ క్లినిక్స్ వల్ల ప్రజారోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను రాష్ట్రప్రభుత్వం తీసుకొస్తుందని, ఇది ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం చేయడం ఎలా అనే అంశంపై రాష్ట్ర ఆరోగ్య రంగ సంస్కరణల కమిటీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రైవేట్ చేతుల్లో ఉంటే చాలా నష్టాలు కలుగుతాయని చెప్పారు. ప్రభుత్వం చేయలేని పనులను నీతి అయోగ్ ప్రైవేట్‌కు అప్పగించాలని ప్రతిపాదనలు చేసిందన్నారు. పట్టణ వైద్య కేంద్రాలను గత ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రైవేట్‌కు అప్పగించిందని విమర్శించారు. నీతి అయోగ్ చెప్పినట్లు పాటిస్తే ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడేలా ప్రాథమిక వైద్య కేంద్రాల్లో వైద్యులను నియమించి సౌకర్యాలను కల్పించేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రొఫెసర్ ఎన్ పురేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యానికి అయ్యే ఖర్చుల్లో ప్రజలు 70శాతం పెడుతుంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం 30శాతమే చేస్తోందని తెలిపారు. ప్రైవేటీకరణతో వైద్య ఖర్చులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని తెలిపారు. వీటిని భరించలేక మిగతా 2లో

సంపన్నులపై పన్నులు

- అసమానతలు పెంచుతున్న పాలకుల విధానాలు
- కేంద్ర నిధులు కింది స్థాయికి చేరాలి
- నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ

● లోపలి పేజీలో.. ●

టాంజానియాలో కుప్పకూలిన విమానం

- 19 మంది మృతి, 26 మందిని కాపాడిన సహాయక సిబ్బంది

● లోపలి పేజీలో.. ●

బోద రహిత జిల్లాలుగా శ్రీకాకుళం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు

- కుష్టు నివారణలో తూర్పుగోదావరి ఫస్ట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దోమల ద్వారా వ్యాప్తి చెందే బోదకాలు (ఫైలేరియా) నిర్మూలనలో శ్రీకాకుళం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు వంటి ఐదు అవిభక్త జిల్లాలను కేంద్రం బోద రహిత జిల్లాలుగా ప్రకటించింది. ఎపి వైద్య ఆరోగ్యశాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. బోద వ్యాధి తీవ్రతను తగ్గించడానికి 2002నుంచి అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తోందని పేర్కొంది. కుష్టు వ్యాధి వ్యాప్తి నివారణలో తూర్పుగోదావరి జిల్లా ముందువరుసలో నిలిచిందని ఎపి వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా గత మూడేళ్లలో కొత్త కేసులు నమోదు కాలేదని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఆరోగ్యసిబ్బంది, ఆశావర్కర్లు, ఎఎన్‌ఎంలు, గ్రామ వాలంటీర్లు సర్వేలు నిర్వహించి, బాధితులు, కుటుంబాలతో చర్చించడం ద్వారా వ్యాధి వ్యాప్తిపై చైతన్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

నగదు చలామణి రెట్టింపు

పెద్దనోట్ల రద్దుకు ఆరేళ్లు ● రూ.17.7 లక్షల కోట్లు.. రూ.30.88 లక్షల కోట్లకు పెరిగిన వైనం



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేసిన 2016 నవంబర్ 8వ తేదీతో పోలిస్తే ఇప్పుడు నగదు చలామణి దాదాపు రెట్టింపయ్యింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సమాచారం ప్రకారం అక్టోబర్ 21, 2022 నాటికి ఆర్థిక వ్యవస్థలో నగదు రూపంలో చలామణిలో ఉన్న నోట్ల విలువ రూ.30.88 లక్షల కోట్లు. నవంబర్ 4, 2016లో (నోట్లరద్దుకు ముందు) నగదు చలామణి కేవలం రూ.17.7 లక్షల కోట్లు. ఆరేళ్ల క్రితంనాటితో పోల్చితే... నగదు చలామణి 71.84 శాతం పెరిగింది. ఆర్థిక వ్యవస్థలో నగదు వినియోగం అనూహ్యంగా పెరిగిందనేది సుస్పష్టం. కరెన్సీ లావాదేవీలు, వస్తువులు, సేవల కొనుగోలుకు వాడే నోట్లు, నాణెలను లెక్కించి ఆర్‌బిఐ డేటా విడుదల చేస్తోంది. నోట్ల రద్దు తర్వాత డిజిటల్ మోడ్‌లోనూ ఆర్థిక లావాదేవీలు మొదలయ్యాయి. కోవిడ్ సంక్షోభం కారణంగా మరింత పెరిగాయి.

అప్పట్లో మోడీ సర్కారు పెద్ద నోట్లు రద్దు చేయడం పేదలు, సామాన్యుల్ని ఎంతగానో ఇక్కట్లకు గురిచేసింది. రూ.500, రూ.1000 నోట్లరద్దుతో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు దెబ్బతిని.. కోట్లాది మంది రోడ్డునపడ్డారు. నోట్లరద్దు నిర్ణయం ఎంత అట్టర్ ఫ్లాప్ అయ్యిందో అందరికీ తెలుసు. ఈ నిర్ణయం తీసుకున్న సమయంలో జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోడీ, అప్పుడు చెప్పినదానికి.. ఇప్పుడు జరుగుతున్నదానికి పొంతన లేదు. అవినీతిని రూపుమాపటం, నల్లధనాన్ని వెలికి తీయటం కోసమే నోట్లు రద్దు చేశామన్నారు. తక్కువ నగదు చలామణి గల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటమే నోట్లరద్దు లక్ష్యమని కేంద్రం పలుమార్లు ప్రకటించింది. ఇందులో ఇసుమంతైనా నిజం లేదని తాజా గణాంకాలు చెబుతున్నాయి.

నోట్లరద్దు నిర్ణయాన్ని దేశ, విదేశాల్లోని ఎంతోమంది ఆర్థికవేత్తలు, నిపుణులు వ్యతిరేకించారు. ఇది పూర్తిగా రాజకీయ ఉద్దేశంతో కూడుకున్నదని విమర్శించారు. నల్లధనం, అవినీతి ఎన్నో రెట్లు పెరిగిందేగానీ, తగ్గలేదు. దర్యాప్తు ఏజెన్సీల దాడుల్లో నోట్ల కట్టలు, సంచులు దొరుకుతున్నాయి. నగదు చలామణి అనూహ్యంగా పెరగటమేగాక, డిజిటల్ చెల్లింపులు సైతం ఎన్నోరెట్లు ఉన్నాయి. స్థూల దేశీయోత్పత్తిలో (జిడిపి)కి, నగదు చలామణికి మధ్య ఉన్న సంబంధంలో నగదు చలామణి భారీగా పెరిగింది. అదే స్థాయిలో ఆర్థిక వృద్ధి మాత్రం నమోదు కాలేదు. ఆర్థిక వ్యవస్థలో నగదు చలామణి భారీగా పెరగటం ద్రవ్యోల్బణానికి దారితీస్తుందన్నది తెలిసిందే. ఇప్పుడు దీనిని అరికట్టలేక ఆర్‌బిఐ చేతులెత్తేసింది.

ఎన్‌ఎఓబి అధికారులు, నిర్వాసితులతో తక్షణం ఉమ్మడి సమావేశం

- సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేషన్ బేస్ (ఎన్‌ఎఓబి) నిర్వాసితులు, మత్స్యకారుల సమస్యలు పరిష్కంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ఎన్‌ఎఓబి అధికారులు, నిర్వాసితులతో తక్షణం ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి నిర్వాసితుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారంనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఎన్‌ఎఓబి మెయిన్ గేట్ వద్ద గత వారం రోజులుగా వేలాది మంది నిర్వాసితులు, మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారని, వీరి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాంబిల్లి, ఎస్ రాయవరం మండలాల పరిధిలోని తొమ్మిది గ్రామాల ప్రజలు 2005లో ఎన్‌ఎఓబి ప్రాజెక్టు కోసం 4,800 ఎకరాల భూమిని, శారదా, వరాహ నదులను త్యాగం చేశారని పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని 2011లో రాంబిల్లి నుండి విశాఖపట్నం కలెక్టరేట్ వరకు రెండు రోజులు పాటు వేలాది మంది పాదయాత్ర నిర్వహించారని తెలిపారు. పాదయాత్ర నేపథ్యంలో అప్పటి జిల్లా కలెక్టర్ లవ్ అగర్వాల్ నిర్వాసితులతో ఒప్పందం చేసుకున్నారని అన్నారు. శారదా, వరాహ నదుల్లో చేపలు వేట చేసుకునే మత్స్యకారులందరికీ జెట్టి నిర్మాణం చేపడతామని, ఆ జెట్టి నిర్మాణం జరిగే వరకు చేపల వేటకు అంతరాయం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్రస్తుతం ఆ హామికి భిన్నంగా వరహా, శారద నదులకు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారని తెలిపారు. చేపల వేటకు వెళ్లడానికి గేట్లు పెట్టి, ఇప్పుడు ఆ గేట్లు నుండి రావద్దంటున్నారని అన్నారు. దీంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయి దిక్కుతోచని పరిస్థితుల్లో రోడ్డెక్కి తమ నిరసను తెలుపుతున్నారని తెలిపారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు వున్నా వాటిని ఎన్‌ఎఓబి నిర్మాణపనుల్లో అమలు చేయడంలేదని పేర్కొన్నారు. నిర్వాసితులకు ఎల్‌అండ్‌టి కంపెనీ ఎక్కడా ఉపాధి కల్పించడంలేదని తెలిపారు. వేల్పుగుండుపాలెం, దేవళ్లపాలెం, పిసినుగొట్టిపాలెం, రేవువాతాడ గ్రామాల ప్రజలకు మిగతా 2లో

పాదయాత్రతో పేదలకు భరోసా వచ్చింది

- మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రతో ప్రజలకు భరోసా కలిగిందని రాష్ట్ర మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్ తెలిపారు. ప్రతిపక్ష నాయకులుగా ప్రజాసమస్యలు ఎలా తెలుసుకోవాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ తెలుసుకోవాలని సూచించారు. ప్రతిపక్షనేతగా రాష్ట్రంలో ప్రజాసంకల్పయాత్ర పేరుతో జగన్ నిర్వహించిన పాదయాత్ర ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఐదవ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదట వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డితోపాటు పాదయాత్ర చేసిన వారిని ఘనంగా సన్మానించారు. మంత్రులు నాగార్జున, జోగి రమేష్‌లు మాట్లాడారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ రాష్ట్రంలో అలజడులు, అశాంతిని సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 16 నెలల పాటు సాగిన పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడా సహనం కోల్పోలేదని అన్నారు. 341 రోజులపాటు 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా పరిశీలించారని అన్నారు. ఆ పాదయాత్రే నేడు రాష్ట్రంలో సంక్షేమ రాజ్యానికి నాంది అయ్యిందని అన్నారు. మేనిఫెస్టోకు మూడేళ్లలో దాదాపు 95 శాతం పరిష్కారం చూపారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు పుప్పాల శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తల సమన్వయకర్త పుత్తా ప్రతాప్ రెడ్డి , ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఫైబర్ నెట్ ఛైర్మన్ పూనూరు గౌతంరెడ్డి, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

27న విజయవాడలో సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ మహాజనసభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 27న విజయవాడ తుమ్మళపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర మహాజనసభ నిర్వహించనున్నట్లు ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవి రావు పేర్కొన్నారు. విజయవాడ గవర్నర్‌పేట రెవెన్యూభవన్‌లో ఆదివారం మహాజనసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ అడహాక్ కమిటీ సభ్యులు వి.ఆర్లయ్య, షామీర్‌హుస్సేన్, ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర కోశాధికారి వివి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకై ఆత్మగౌరవ పోరాటం

- మోడీ పర్యటన సందర్భంగా నిరసనలు
- ఉక్కు పోరాట వేదిక పిలుపు



మీడియాతో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోరాటాల సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నారని విశాఖ ఉక్కు పోరాట వేదిక వెల్లడించింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 11న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. విశాఖ వేదికగా మోడీ ప్రసంగించబోయే బహిరంగ సభలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయబోమని, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే నిర్వహిస్తామని, రాష్ట్రవిభజన చట్ట అంశాల అమలుపై నిర్దిష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్‌తో ఈ నిరసనలను తలపెట్టినట్లు వేదిక నాయకులు వెల్లడించారు. విజయవాడలోని దాసరిభవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ ప్లాంట్ కోసం 34 మంది ప్రాణత్యాగం చేశారని, 16 వేల మంది రైతులు భూములు త్యాగం చేశారని తెలిపారు. దీనిని విదేశీ కంపెనీ పోస్కోకు, అదానీకి కట్టబెట్టడం దేశద్రోహమని మండిపడ్డారు. రాష్ట్రవిభజన చట్టాన్ని అమలు చేయాలని, ప్రత్యేక హోదాను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విశాఖ ఉక్కు పోరాట వేదిక కన్వీనర్ జి ఓబులేశు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి కేంద్రప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా అందరూ పోరాటాలకు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ నిరసనల్లో అన్ని కార్మిక, యువజన, విద్యార్థి, వ్యవసాయ, రైతు సంఘాలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జల్లి విల్సన్ మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తే రాబోయే కాలంలో బడుగు, బలహీన వర్గాల యువతకు రాజ్యాంగ పరంగా రావాల్సిన రిజర్వేషన్ ఫలాలు దూరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని ప్రజల ఆస్తిగానే కొనసాగించాలని, మోడీ పర్యటన సందర్భంగా చేపట్టే నిరసనల్లో అన్ని వర్గాల ప్రజానీకం భాగస్వామ్యంతో ప్లాంట్‌ను పరిరక్షించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్ పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎంవిఎస్ శర్మ

పాలకులకు పట్టని ముస్లిముల సంక్షేమం

- సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పాలకులకు ముస్లిముల సంక్షేమం పట్టడం లేదని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. సమాజంలో ముస్లిములు వేరు కాదని, వారూ అంతర్భాగమేనని తెలిపారు. విశాఖ జిల్లా డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆవాజ్ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా '75 ఏళ్ల స్వాతంత్ర్యం - ముస్లిముల స్థితిగతులు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన శర్మ మాట్లాడుతూ ముస్లిములు, ఇతర తరగతుల వారు ఒకరికొకరు తమ సమస్యలు కలిసి మెలిసి పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలన్నారు. మైనారిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు వారికి అందడం లేదన్నారు. చదువులో వెనుకబాటుతనం లేకుండా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సచార్ కమిటీ నివేదికను వివరించారు. ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ చిష్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణరాయ్ ఛటర్జీ, మాలినీ మెస్తా

- కార్మికులకు పెన్షన్ పథకం అమలు చేయాలని మహాసభలో తీర్మానం


కృష్ణరాయ్ ఛటర్జీ


మాలినీ మెస్తా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎండిఎండబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణరాయ్ ఛటర్జీ, మాలినీ మెస్తా ఎన్నికయ్యారు. శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఎండిఎండబ్ల్యుఎఫ్ఐ జాతీయ రెండో మహాసభలో రెండో రోజు 51 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. ఆఫీసు బేరర్లుగా 15 మంది, వర్కింగ్ కమిటీ సభ్యులుగా 36 మంది ఎన్నుకోబడ్డారు. కోశాధికారిగా హిమిదేవి (హిమాచల్‌ప్రదేశ్), కార్యదర్శులుగా దయా రమాదేవి (ఆంధ్రప్రదేశ్), ఎస్‌వి.రమ (తెలంగాణ), సంజయ్‌బారీ (అస్సాం), సునిల్‌నట్టి (పశ్చిమబెంగాల్), సర్భట్టి (హర్యానా), డాక్టర్ అశోక్ థోరట్ (మహారాష్ట్ర) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జైభగవాన్ (సెంటర్), ఎస్.వరలక్ష్మి (కర్ణాటక), మౌనికదత్తరాయ్ (త్రిపుర), విపి.కున్నికృష్ణణ్ (కేరళ) ఎన్నుకోబడ్డారు. ఒక ఉపాధ్యక్ష, ఒక కార్యదర్శి పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. వర్కింగ్ కమిటీలో ఆంధ్రప్రదేశ్ నుంచి జి.వరలక్ష్మి, నాగమణి, తెలంగాణ నుంచి టి.చక్రపాణి, బాలలక్ష్మి ఉన్నారు. మహాసభలో పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. పాఠశాల విద్యార్థుల మెస్ ఛార్జీలతోపాటు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు పెంచాలని మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. నూతన విద్యా విధానం (ఎన్ఇపి) అమలులో ఉన్న రాష్ట్రాల్లో బాలికల డ్రాప్ అవుట్లు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్ఇపిని వ్యతిరేకిస్తూ సభ తీర్మానించింది. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని, కార్మికులకు పెన్షన్ పథకం అమలు చేయాలని ప్రతిపాదించిన తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది.

సహకార బ్యాంకులతో రైతులకు ప్రయోజనం

- బ్యాంకుల బలోపేతానికి ఉద్యోగ సంఘాల తోడ్పాటు అవసరం
- ఎపి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలో పలువురు వక్తలు


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్ (శ్రీకాకుళం)

ఎటువంటి లాభాపేక్ష లేకుండా రైతులకు మేలు చేసేందుకు ఏర్పాటైన సహకార బ్యాంకులను కాపాడుకునేందుకు ఉద్యోగులు నిరంతరాయంగా శ్రమించి మెరుగైన సేవలందించాలని పలువురు వక్తలు కోరారు. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 13వ రాష్ట్ర మహాసభ ఆదివారం శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు నిర్వహించే ఈ మహాసభలో భాగంగా తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి అంబేద్కర్ ఆడిటోరియం వరకు ర్యాలీ సాగింది. అనంతరం జరిగిన సభలో శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో ఉండాలన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాలు అవగాహనతో ప్రోత్సహించడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. రైతులకు ఆప్కాబ్ అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదన్నారు. సహకార రంగంలో ఉన్న కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు నుంచి రైతులు రుణాలు పొందుతూ వ్యవసాయ పెట్టుబడులను పొందగలుగుతున్నారని తెలిపారు. ఇటువంటి రంగంలో సేవ చేసే అవకాశం ఉద్యోగులకు దొరకడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుతో తన కుటుంబానికి విడదీయలేని బంధం ఉందని తెలిపారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై మహాసభలో చర్చించారు. అనంతరం ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కో-పరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


దీక్షల్లో కూర్చున్న బివి.రామ్, తదితరులు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

- తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ ప్రకటన చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ కోరారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 633వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ వస్తున్న ప్రధాని మోడీ పర్యటన స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులతో చర్చించాలని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మోడీ పాల్గొనబోయే బహిరంగ సభలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కార్మిక సంఘాల ప్రతినిధులకు వేదికపై స్థానం కల్పించే విధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రయత్నం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలతోనే దేశాభివృద్ధి సాధ్యమైందని, ఆ విషయాన్ని మరిచి పరిశ్రమలను ప్రయివేటుపరం చేస్తే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. ఎపికి అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగేలా ప్రధాని చూడాలని కోరారు.

'రేడియంట్' పేరిట భూ దోపిడీ

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపణ

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ జిల్లాలోని మధురవాడ సర్వే నెంబర్ 33/6లో వెయ్యి కోట్ల రూపాయలపైగా విలువైన భూ కుంభకోణం చోటుచేసుకుందని, రేడియంట్ డెవలపర్స్ పేరుతో జరిగిన ఈ భూ దోపిడీలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సతీమణి భారతి ప్రోద్బలం ఉందని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో రూ.93 కోట్లకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రమేష్‌కుమార్ బంగూరికి చెందాల్సిన భూమిపై కుట్ర జరిగిందని ఆరోపించారు. మూడున్నరేళ్ల వరకు ఆగి ఇప్పుడు రిజిస్ట్రేషన్‌కు ఎందుకు సిద్ధపడ్డారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావుకు మొత్తం వివరాలు ఇస్తామని, మోడీ వచ్చేలోపే విచారణకు ఆదేశించాలని కోరారు. విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మైనింగ్ వ్యాపారని, బిల్డర్‌గా అనుభవం లేదని, రేడియంట్ డెవలపర్లను ఆయనకు ఎలా అప్పగించారో తెలియాల్సి ఉందని అన్నారు. టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి నేతలు విశాఖలో భూములను అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరోపించారు. భూముల కాజేతకే విశాఖను రాజధాని చేస్తున్నారేమో అనిపిస్తోందని విమర్శించారు.

ప్రజాస్వామిక వ్యవస్థకు పాతరేస్తున్న జగన్ సర్కార్

- 11న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రజాస్వామిక వ్యవస్థను జగన్ ప్రభుత్వం పాతరేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత విధానాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు, ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలపై త్వరలో కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఒక దుర్మార్గమైన, రాక్షస పాలన కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిరంకుశ విధానాలపై 4, 5 తేదీల్లో జరిగిన పార్టీ రాష్ట్ర సమితి సమావేశాల్లో సమగ్రంగా చర్చించామని తెలిపారు. పోలీసులను ప్రయోగించి ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని మండిపడ్డారు. కోర్టుల్లో ఎన్నిసార్లు ఎదురుదెబ్బలు తగిలినా తీరు మారడం లేదన్నారు. జగన్ మారకపోతే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి వైసిపి పూర్తిగా సహకరిస్తున్నా రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు, నిధుల రప్పించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రానికి ఏం చేశారని మూడు లక్షల మందితో మోడీకి రాష్ట్ర ప్రభుత్వం స్వాగతం పలకనుందని ప్రశ్నించారు. కేసుల మాఫీ కోసమా? విశాఖ స్టీలు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రం చెప్పినందుకా?, విభజన హామీలను అమలు చేయనందుకా? అని ప్రశ్నించారు. మోడీ పర్యటన సందర్భంగా ఈనెల 11వ తేదీన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని, విభజన హామీలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు నిరసన తెలపనున్నట్లు ప్రకటించారు. తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని రాష్ట్ర సమితి సమావేశాల్లో 11 మందితో ఎన్నుకున్నామని రామకృష్ణ వెల్లడించారు.

ఎన్ఎబిబి నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు


నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడుతున్న అప్పారావు

ప్రజాశక్తి - రాంబిల్లి (అనకాపల్లి జిల్లా)

నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఎఒబి) కోసం భూములను, ఉపాధిని త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ రాంబిల్లి మండలం వాడనర్సాపురం గ్రామం వద్దనున్న ఎన్ఎఒబి మెయిన్ గేటు వద్ద నేవల్ బేస్ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన ఆదివారానికి ఏడో రోజుకు చేరింది. పెద్ద సంఖ్యలో హాజరైన నిర్వాసితులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా ఎనిమిది గ్రామాల నేవీ నిర్వాసితులు రేయింబవళ్లు ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నిర్వాసితుల సమస్యలపై జిల్లా కలెక్టర్, నేవీ అధికారులు చొరవ చూపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. చిత్తశుద్ధితో వ్యవహరించకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఆందోళన /జరుగు తున్న ప్రాంతానికి అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ, ఫిషరీస్ జెడి లక్ష్మణరావు, నేవీ ఎస్‌డిసి లక్ష్మణమూర్తి వచ్చి నిర్వాసితులతో మాట్లాడారు. నిర్వాసిత నాయకులు కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌తో చర్చించాలని కోరారు. నిర్వాసితులు స్పందిస్తూ కలెక్టరే ఇక్కడికి వచ్చి అన్ని సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని పట్టుబట్టి ఆందోళన కొనసాగించారు. కార్యక్రమంలో ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి శేఖర్, సిపిఎం మండల కార్యదర్శి జి దేముడు నాయుడు, టిడిపి నాయకులు లాలం భాస్కరరావు, రంగనాయకులు, దిన బాబు పాల్గొన్నారు.



16వ నెంబరు జాతీయ రహదారిపై బైటాయించిన రైతులు

రోడ్డెక్కిన అన్నదాతలు

- ధాన్యం కొనుగోలు చేయాలంటూ రాస్తారోకో
- ప్రయాణికులకు ఇబ్బందులు కల్పించారంటూ రైతులపై పోలీసుల కేసు

ప్రజాశక్తి- గండేపల్లి(కాకినాడ జిల్లా)

ధాన్యం కొనుగోలు చేయాలంటూ కాకినాడ జిల్లా గండేపల్లి మండలానికి చెందిన రైతులు జడ్.రాగంపేట వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై ధాన్యం బస్తాలతో ఆదివారం బైఠాయించి రాస్తారోకో చేశారు. పంటను తక్షణం కొనుగోలు చేయాలని, మద్దతు ధర ఇవ్వాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. జిల్లా అధికారులు వచ్చి సమాధానం చెప్పేంతవరకూ ఇక్కడి నుంచి కదిలేదని భీష్మించారు. రైతుల ఆందోళనతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆర్‌బికెలతో తమకు భరోసా కల్పిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయన్నారు. కోతలు ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణం మార్పులతో రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. కోసిన పంటను అమ్ముకునే వీలులేక, దాచుకునే దారిలేక కళ్లాల్లోనే పెట్టుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఇదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి అయ్యన్నపాత్రుడుకు సంఘీభావం తెలిపేందుకు అటుగా వెళ్తున్న ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అక్కడికి వచ్చి రైతులకు సంఘీభావం తెలిపారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆందోళన విరమించాలని కోరారు. జిల్లా అధికారులు వచ్చే సమస్యలు పరిష్కరించే వరకూ రాస్తారోకో విరమించేది లేదని రైతులు తేల్చి చెప్పారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అయితే, రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాస్తారోకో నిర్వహించి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేసినట్లు కేసు పెట్టామని గండేపల్లి ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు.

ఎన్ఎఓబి అధికారులు, నిర్వాసితులతో తక్షణం ఉమ్మడి సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్ఎఓబి నిర్వాసితుల కోసం నిర్మించిన కాలనీలో వీదిలైట్లు, రోడ్లు, పారిశుద్యం లాంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నిర్వాసిత కుటుంబాల్లోని మేజర్ కుమారులు, కుమార్తెలుకు ప్యాకేజీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఎన్ఎఓబి ప్రాజెక్టులో భూములు, ఉపాధి కోల్పోయిన ప్రభావిత గ్రామాలైన చిన్న కళవలపల్లి, కొత్తపేట, గోవిందపాలెం, వాడపాలెం గ్రామాలకు ప్యాకేజీ అమలు చేయలేదని తెలిపారు. నిర్వాసితులకు ఒప్పందం ప్రకారం రెసిడెన్షియల్ స్కూల్, కేంద్రీయ విద్య, వైద్యం అమలు చేయడంలేదని తెలిపారు. జెట్టీ నిర్మాణం చేసేదాకా ప్రతి మత్స్యకారుడికి నెలకు రూ18వేలు జీవన భతి ఇవ్వాలని కోరారు. అలాగే వాడనర్సాపురం, కొత్తపట్నం వద్ద డ్రెడ్జింగ్ చేయడం వలన తీర ప్రాంతం 4 నుండి 5 మీటర్లు ఎత్తు పెరగడంతో వేటకు అంతరాయం కలుగుతోందని ఈ రెండు గ్రామాల మత్స్యకారులకు డ్రెడ్జింగ్ ప్యాకేజీని తక్షణం అమలు చేయాలని కోరారు. మగవారితో సమానంగా మహిళలకు గంపల ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని నిర్వాసితులు, మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారని, పాదయాత్ర సందర్భంగా ఎన్ఎఓబి నిర్వాసితుల సమస్య పరిష్కారం చేస్తానని ముఖ్యమంత్రి హామి ఇచ్చారని తక్షణం ఈ సమస్యలపై జోక్యం చేసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య రంగం

(మొదటి పేజీ తరువాయి)

చాలా మంది ప్రజలు పేదరికంలోకి నెట్టబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య రంగంలో కొత్తకొత్త పథకాలు ప్రవేశపెడుతున్నా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం జరగడం లేదని, ప్రైవేట్ ఆస్పత్రుల వైపే ప్రభుత్వాలు చూస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులు, వ్యవస్థ బాగుపడితేనే ప్రజారోగ్యం బాగుపడుతుందన్నారు. వేదిక నాయకులు జి విజయ ప్రకాష్ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో వేదిక కార్యదర్శి కామేశ్వరరావు, డాక్టర్ మాకినేని కిరణ్, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు. ప్రజారోగ్య వేదిక యుట్యూబ్ చానెల్‌ను అంతకుముందు శ్యాంప్రసాద్ ప్రారంభించారు. సదస్సు అనంతరం ప్రజారోగ్య వేదిక రాష్ట్రప్లీనంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కెవి సాయిప్రసాద్, అధ్యక్షునిగా రమణయ్య, కార్యదర్శిగా కామేశ్వరరావు, కోశాధికారిగా వంశీకృష్ణ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు అస్వస్థతపై నివేదిక ఇవ్వండి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు
- ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటిని సందర్శించి విద్యార్థులకు పరామర్శ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్ (శ్రీకాకుళం జిల్లా)

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్‌జియుకెటి) ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై మూడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు అధికారులను ఆదేశించారు. దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటిని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులతో కలిసి చైర్మన్ ఆదివారం సందర్శిం చారు. డైరెక్టర్, చీఫ్ వార్డెన్లతో కలిసి మెస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 225 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు విచారణలో తేలింద న్నారు. సకాలంలో వైద్యులు, సిబ్బంది స్పందిం చిన తీరు అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం మెరుగ్గానే ఉన్నట్లు వైద్యులు తెలిపారని చెప్పారు. మెస్‌లోని ఆహారం, మంచినీటి శాంపిళ్లను పరీక్షల కోసం పంపిం చామని, రెండు రోజుల్లో నివేదిక వస్తుందని తెలిపారు. ఇటువంటివి పునరా వృతం కాకుండా చూడాలని ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌ను ఆదేశించారు. మరో వారం రోజులపాటు వైద్యశిబిరం కొనసాగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్ ఐటిలో మౌలిక వసతులపై ఆరా తీశారు. అస్వస్థతకు కారణాలను అడిగి తెలుసుకొన్నారు. విచారణ అనంతరం బాధ్యులపై కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. చైర్మన్ వెంట బాలల సంరక్షణ సమితి చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, నోడల్ అధికారి ఎం.శరత్‌బాబు, సభ్యులు వి.రమణమూర్తి, ఎం.గన్నెప్పుడు, ట్రిపుల్ ఐటి సంచాలకులు పి.జగదీశ్వరరావు, వైద్యాధికారి ప్రియాంక ఉన్నారు.


అస్వస్థతకు గురైన విద్యార్థినితో మాట్లాడుతున్న చైర్మన్ అప్పారావు

క్లాప్ ఆటో డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల వద్ద నుంచి చెత్త తీసుకెళ్లేందుకు నియమించిన క్లాప్ ఆటో డ్రైవర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మునిసిపల్ క్లాప్ ఆటో డ్రైవర్స్ రాష్ట్ర సదస్సులో ఆయన ప్రసంగించారు.

క్లాప్ ఆటో డ్రైవర్లకు నెలనెలా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తక్షణం వారికి పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు కావడంలేదని అన్నారు. చాలా ప్రాంతాల్లో కాంట్రాక్టర్ల వేదింపులు అధికమయ్యాయని అన్నారు. చీకటి మాటికి కార్మికులను బెదిరిస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్స్‌కు రక్షణ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సదస్సులో క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు రాము, అనిల్, ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎం డేవిడ్, ఎస్ జ్యోతిబసు, ఎంవి ప్రసాదరావు, సుంకర రవి, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఖలీల్, వెంకటేశ్వరరావు, సన్నీ, ధనాల శ్రీనివాసరావు, పెద్దయ్య, అన్నమయ్య, రఘు, శ్రీనివాసులు, నర్సింహ, కిరణ్, రామకష్ణ, సునీల్, కరీముల్లా, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



దశల వారీగా ఆందోళనలకు తీర్మానం

క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని సదస్సు తీర్మానించింది. ఈనెల 15వ తేదీలోపు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యలపై వినతులను అందజేసి రాయబారాలు చేపట్టాలని, 25వ తేదీ లోపు సమావేశాలు నిర్వహించాలని, డిసెంబర్ 4న జిల్లా కేంద్రాల్లో బైక్ ర్యాలీలు చేపట్టాలని తీర్మానించింది. అప్పటికీ సమస్యకు పరిష్కారం చూపకపోతే డిసెంబర్ 3వ వారంలో చలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి ఆఫీసు కార్యక్రమాన్ని చేపట్టడంతోపాటు అవసరమైతే సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా వుండాలని క్లాప్ ఆటో డ్రైవర్లకు సదస్సు పిలుపునిచ్చింది.


వైఎస్ విగ్రహం వద్ద ఇనపముళ్ల కంచె వేసి కూర్చున్న పోలీసులు

పోలీసు పహారాలో ఇప్పటం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లు కూల్చివేత వల్ల ఉద్రిక్తత ఏర్పడిన నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు కొనసాగిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ విగ్రహాల చుట్టూ కంచె వేసి బందోబస్తు ఏర్పాటు చేసిన దృశ్యాలు ఆదివారమూ కనిపించాయి. ఇప్పటంలో కేవలం ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్ల ప్రహరీలనే కూల్చివేశారని మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ చేసిన ప్రకటనలను జనసేన నాయకులు తప్పుపట్టారు. జనసేన రాష్ట్ర ప్లీనరీ సభకు స్థలం ఇచ్చినందుకే ఇళ్లను కూల్చివేశారని జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గుంటూరులోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన మీద ఉన్న కక్షతో రాజకీయ ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను తొలగించారని, వైఎస్ విగ్రహం చుట్టూ ఇనుప కంచె వేసి పోలీసుల పహారా పెట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే 120 అడుగుల రోడ్డు లేదని, అలాంటిది ఒక పల్లెటూరిలో 120 అడుగుల రోడ్డు వేస్తామని ఇళ్లు కూలుస్తారా? అని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ సభకు స్థలం ఇస్తే నేరం చేసినట్లు మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

కార్యకర్తలనే కుటుంబంలా భావించిన స్వర్ణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులను ఎంతో అప్యాయంగా పలకరిస్తూ వారినే తన కుటుంబంగా భావించిన మంచి మనసున్న వ్యక్తి సింహాద్రి స్వర్ణ అని వక్తలు కొనియాడారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని కాజ గ్రామంలో సిపిఎం కార్యకర్త, ఐద్వా నాయకులు సింహాద్రి స్వర్ణ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకు లు బి కోటేశ్వరి అధ్యక్షత వహించిన సభలో మాజీ ఎంపి, సిపిఎం సీనియర్ నాయకులు పి మధు మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలు గుండెకాయని భావించి కార్యకర్తల ను, వారి ఆరోగ్యాలను స్వర్ణ కుటుంబం నిత్యం గమనించేవారని, ఎల్లప్పుడూ అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి సేవలందించారని కొనియాడారు. తన మామగారు శివారెడ్డి బాటలోనే స్వర్ణ నడిచారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాట కాలం నుండే శివారెడ్డి కుటుంబం దేశం కోసం, పేదల కోసం నిలబడిందని అన్నారు. సిపిఐ (ఎంఎల్) నాయకులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ డబ్బు, కులం, మతాలకు అతీతంగా అందర్నీ అక్కున చేర్చుకోవడం స్వర్ణలో ఆదర్శవంతమైన గుణమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, బి తులసీదాస్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, పోస్టల్ ఉద్యోగుల విశాఖపట్నం నాయకులు ఎంఆర్‌పి రాజు, స్వర్ణ భర్త సింహాద్రి కోటిరెడ్డి మాట్లాడారు. నివాళు లర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ల్యాంకో సిఇఒ ఎస్ వెంకట్రామిరెడ్డి, సిపిఎం నాయకులు కె హరికిషోర్, ఎస్ఎస్ చెంగయ్య, ఇ అప్పారావు, బి నిర్మల ఉన్నారు.


స్వర్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పి.మధు, సింహాద్రి ఝాన్సీ తదితరులు


మాట్లాడుతున్న జెఎసి నాయకులు

రాజధాని మాస్టర్ ప్లాన్‌లో మార్పులు తగవు

- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 11న సిఆర్‌డిఎ కార్యాలయాల్లో వినతులు
- అమరావతి పరిరక్షణ సమితి జెఎసి నిర్ణయం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి


సిఆర్‌డిఎ చట్టాన్ని సవరించి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 11న సిఆర్‌డిఎ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు అమరావతి పరిరక్షణ సమితి జెఎసి నాయకులు వెల్లడించారు. గుంటూరులోని మౌర్య ఫంక్షన్ హాల్‌లో అమరావతి జెఎసి లీగల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మాదాల శ్రీనివాస్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. అమరావతినే రాష్ట్ర ఏకైక రాజధానిగి కొనసాగించాలని చేపట్టిన పాదయాత్రను భగ్నం చేసేందుకు ప్రభుత్వం కొత్త ఎత్తుగడలతో కుటిల పన్నాగాలు పన్నుతోందని విమర్శించారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయకుండా అభివృద్ధి చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చి ఎనిమిది నెలల తరువాత ప్రభుత్వం కావాలని సుప్రీంకోర్టుకు వెళ్లిందన్నారు. హైకోర్టు తీర్పుపై స్టే అడుగుతున్న ప్రభుత్వ వైఖరి అనుమానాస్పదంగా ఉందని తెలిపారు. సిఆర్‌డిఎ చట్టాన్ని సవరించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రయత్నం చేస్తోన్న ప్రభుత్వ కుటిల యత్నాలను అడ్డుకుంటామని చెప్పారు. అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ ఆరే శివారెడ్డి మాట్లాడుతూ హైకోర్టు నిర్ణయం వెలువడిన తర్వాత పాదయాత్ర కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. తాత్కాలికంగా నిలిపివేసిన పాదయాత్ర వాహనాలను ప్రైవేటు స్థలంలో నిలిపి ఉంచామని తెలిపారు. పాదయాత్రలోని దివ్యరథం నుండి సిసి కెమెరా విజువల్స్‌ను పోలీసులు తీసుకెళ్లారని ఆరోపించారు. వాహనాలు నిలిపి ఉంచిన స్థలం యాజమానిని బెదిరిస్తున్నారని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అరసవల్లి వెళ్లే వరకు పాదయాత్ర కొనసాగిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జెఎసి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు భద్రతా ఏర్పాట్లు, అవగాహనా కార్యక్రమాలు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై ఆ శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సాధ్యమైనంత మేర విద్యుత్ ప్రమాదాలను నివారించే వ్యవస్థను రూపొందించాలన్నారు. విద్యుత్ భద్రతను పెంపొందించేందుకు అవసరమైన సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో భద్రత విషయంలో అవలంభిస్తున్న పద్ధతులపై అధ్యయనం చేయాలని సూచించారు. వీటి ఆధారంగా స్థానిక అవసరాలకు తగినట్లు కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను రూపొందించాలని, ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని అన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల కమిటీలు గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు రక్షణకు సంబంధించిన అంశాలను చర్చించాలని సూచించారు. రాష్ట్రంలో ఏవిధంగా విద్యుత్ భద్రతను మెరుగుపరచవచ్చో నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు.



నిరంతర విద్యుత్ సరఫరాకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నామో, భద్రతకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సబ్‌స్టేషన్ల వారీగా విద్యుత్ భద్రత తనిఖీలు నిర్వహించాలని, అవసరమైన చోట్ల యుద్ధ ప్రాతిపదికన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. భద్రతా చర్యలపై అలసత్వం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ భద్రతకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు 1912 టోల్ ఫ్రీనెంబర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రమాదాలు జరగకుండా విద్యుత్ వ్యవస్థ పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని ఇంధన శాఖ అధికారులు మంత్రికి వివరించారు. గృహాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతీ వినియోగదారునికీ అవగాహన కలిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ట్రాన్స్‌కో సిఎమ్‌డి బి శ్రీధర్, జెఎండిలు ఐ పృధ్వీతేజ్, బి మల్లారెడ్డి, డిస్కంల సిఎండిలు జె పద్మజనార్ధన రెడ్డి, కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో అపశృతి

- లడ్డు విక్రయశాల వద్ద భక్తుడు మృతి

ప్రజాశక్తి- తిరుమల


తిరుమలలో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. శ్రీవారి దర్శనానంతరం లడ్డూ విక్రయశాలకు వచ్చిన భక్తుడు 24వ కౌంటరు వద్ద అస్వస్థకు గురై కుప్పకూలాడు. టిటిడి భద్రత సిబ్బంది వెంటనే ఆయనను అశ్విని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గుండెపోటే ఇందుకు కారణమని తెలిపారు. ఆ వ్యక్తి వద్ద చిరునామా ఇతర వివరాలు లభించలేదు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 7 నవంబర్ 2022



"సాహిత్యరూపాలన్నీ జీవిత చిత్రణలో ఉపకరణాలుగా, వాహికలుగా ఉపయోగపడడానికే పుట్టాయి. అదే వాటి ప్రయోజనకత్వం. "

– త్రిపురనేని గోపీచంద్

మట్టి మనిషి

వాడెళ్లేచోట
పుడమి పచ్చరంగేస్తుంది
వాడు నడిచేచోట
ధాన్యపు గింజలు మురిసిపోతున్నాయి
వాడడుగేసే ప్రాంతమంతా
పిట్టలు సందడిచేస్తున్నాయి
వాడు తిరిగేచోట
కూడుకి లోటు తెలియని మనుషులున్నారు

వాడి దేహం చుట్టూ పీక్కుతినే
అవినీతి లేదు
ఒంటినిండా సూదులతో పొడిచి
గందరగోళం చేసే సమస్యల్లేవుఊ

అతనిప్పుడు మనసు నిండా
తృప్తిని కప్పుకున్నాడు
అతనిప్పుడు
స్వేచ్ఛని పరిచే పరదా అయ్యాడు
మనుషుల్ని మరింత బతికించే
లోక అంబాసిడరయ్యాడు !
...
రాత్రొచ్చిన కలని వెత్తుక్కుంటూ వెళ్శా
తూర్పు పొలంలో
కలుపు మొక్కల్ని పీకుతూ కనిపించాడు
అన్నపూర్ణ పుత్రుడు
అలియాస్ మట్టిమనిషి!
ఈ కల నిజమైతే ఎంత బాగుణ్ణు!

– అడ్డూరి

కడుపులు తవ్వి ...

చెమట అతడి శక్తిపీఠం
సుప్రభాత సంధ్యలు ఇలవేల్పులు
కండల కైంకర్యం నిత్య నైవేద్యం

ఆకలి అతగాడి ఆత్మబంధువు
నిరంతరం అలల్ని ఎగదోసే సింధువు
దివారాత్రం వెన్నంటి ఉండే అంతశ్శత్రువు
***
శాసనం ప్రభువుల వారి ప్రసాదం
అర్చన అక్కర్లేని అధికార పత్రం
మొక్కులు నిర్ణయించే శఠగోపం

ఆజ్ఞల జారీ ధర్మకర్తల దయాదక్షిణ
ఖజానా రక్షణ పేరిట అష్టోత్తరం
పానకం వడపప్పు పంపిణీకి శుద్ధాచమనం

నూకలు జల్లటంలో
అధినేతల ప్రావీణ్యం పరమ ప్రామాణికం
సుంకం తగిలించటంలో
చేతివాటం మహా సుకుమారం
నొప్పి తెలియకుండా వడ్డించటం
విభాగాధిపతుల విశ్వకళా వైభవం
***
జఠర వాహిని వరదలెత్తుతున్నా
అతడి చేతులు నోటిదాకా చేరలేవు
మెలిదిరిగిన పేగులు కేకలేస్తున్నా
కాళ్లు కాస్తయినా ముందుకు కదల్లేవు

కడుపులు తవ్వి ఎలకలు పట్టడం ఎలాగో
సూత్రధారికి బాగా తెలుసు
ఎటొచ్చీ ఎలకలు కన్నెర్రజేస్తే పుట్టేది
విఘ్నాలు కాదు... విస్ఫులింగాలు!
ఆ జ్వాలల్లో కుర్చీలు కాలిపోతాయని
ఏలినవారికి ఇప్పుడప్పుడే తెలీదు!

– ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

జాగ్రత్త!

రంగుల ఆనవాళ్ళల్లో పొరలు పొరలుగా
నువ్వు నిర్మించబడి ఉన్న సంగతి మరిచి
రంగులేని నవ్వు నవ్వుతావేం?
జీవపు రంగున్న నవ్వులు ఎక్కడ దాచిపెట్టావ్?
నీ అసలుకిపోయి వెదికినప్పుడు జాలువారే
సీతాకోకలు ఇప్పుడు ఏవీ?

ఓయీ నిత్య సంఘర్షీ.. కృత్రిమ మెరుపులకి
అసలు రంగులు వెచ్చించేసావ్ కదా!
గాలి రంగు, ప్రాణం రంగు,
మనసు రంగు, హృదయం రంగు
ఆఖరుకి శరీరం రంగూనూ ...
ఆలోచనల నిజ రంగంతా పోయి
మెదడుని కృత్రిమం ఎలా చేసేసావ్!

కోయిల పాటలకి తడబడుతున్నావ్
అరువు కోయిల కాదూ అని ఒకింత
మనసు స్పందించటం లేదా?
హృదయానికి చెవులు పుట్టే ప్రతిసారీ
సహజత్వాన్ని కాల్చేసే
రక్తం చిందే పిడుగులు కురిసే వాననే నమ్ముతావ్!

మనిషన్న నమ్మకం మానవత్వపు సెగపై
ఉడికి చిమిడిపోయింది, చూసావా..!
ఎన్ని రంగుల్ని కనాలో ఇప్పుడు ...
మెదడుకి సంకేతాలివ్వమని
కృత్రిమ యంత్రానికి చెప్పాలిప్పుడు ...
మనిషిగా మరణించి చాలా కాలమైంది, తెలుసుగా
నేనూ నువ్వూ మనం అన్న నిజం
చిటారు కొమ్మన రెపరెపలాడే చిన్న ఆశే ఇప్పుడు

అసహన హృదయ చప్పుళ్ళూ..
ఆర్తిని కోల్పోయిన మస్తిష్కపు నవ్వులూ..

ఇప్పుడు చిరు దివిటీల్లాంటి పసిబుగ్గలు
గులాబీల్ని పూయించట్లేదు
ప్రశ్నల సున్నితత్వం తుంచబడింది!
ప్రపంచమంతా ఆకాశానికి వలసపోవడానికి
ప్రాణం పోయే మార్గం తవ్వుతున్నారో ఏమో!
ప్రాణాలు రంగుల్లో కలిసిపోతున్నాయి
నిజ ప్రాణాలనే మాట మరిచి మిగిలినవాళ్ళు
కృత్రిమ చోద్యం చూస్తున్నారల్లే ఉంది

రేపటి వంతు మనదే ...
ఈరోజే కొన్ని రంగునీళ్ళు చల్లుకోవాలి!

– అనూరాధ

13న రొట్టమాకురేవు కవిత్వ అవార్డు సభ

ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాదులోని ముంతాజ్ కాలేజీలో రొట్టమాకురేవు కవిత్వ అవార్డు సభ జరుగుతుంది. ప్రసేన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో కె.శివారెడ్డి, గుంటూరు లక్ష్మీనరసయ్య, వంశీకృష్ణ, కోయి కోటేశ్వరరావు పాల్గొంటారు. ఈ ఏడాది అవార్డులను పసునూరు శ్రీధర్ బాబు, వైష్ణవి శ్రీ, బిల్ల మహేందర్, పల్లిపట్టు నాగరాజులకు ప్రదానం చేస్తారు. పుస్తకావిష్కరణలు, కవితాపఠనం కూడా ఉంటాయి.

– యాకూబ్, శిలాలోలిత

కారా కథల్లో దళిత జీవితం

సందర్భం



సాహిత్య ప్రపంచంలో కాళీపట్నం రామారావు పేరు తెలియని వారు లేరు. కథల కోసం 'కథానిలయం' స్థాపించిన కథానాయకుడు. 'చిత్రగుప్త' మొదలుకొని సుమారు ఏభై కథలు రాశారు. సమాజాన్ని చైతన్యం చేయడం కోసం, జాగృతి కలిగించడం కోసం, కలం పట్టిన కథకుడు కారా. దళిత, శ్రామిక, మధ్య తరగతి, అట్టడుగు బడుగు బలహీన వర్గాల వారి జీవితాలను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించిన విఖ్యాత సహజ కథకుడు ఆయన. 1924 నవంబర్ 9వ తేదీన జన్మించారు. 2021 జూన్ 4వ తేదీన మరణించారు.

కారా తన కథల్లో విజ్ఞతకూ, చైతన్యానికీ చాలా ప్రాధాన్యం ఇచ్చారు. యజ్ఞం, ఆర్తి, చావు కథల్లో దళితుల జీవితాలు ఎంత దుర్భరంగా వున్నాయో చిత్రీకరించారు. దళితుల బడబాగ్నిని కళ్ళకు కట్టినట్లు వివరించిన కథ 'యజ్ఞం'. దళితుల్లో సామాజిక స్పృహను కలిగించిన కథ 'ఆర్తి'. చైతన్యాన్ని రేకెత్తించిన కథ 'చావు'. ఈ మూడు కథల్లోనూ దళితుల జీవితాలను ప్రధాన పాత్రలుగా తీసుకొని చక్కగా చిత్రీకరించారు.

తెలుగు కథారంగంలో 'యజ్ఞం' కథ ఒక పెద్ద సంచలనం. 1966లో 'యువ' దీపావళి ప్రత్యేక సంచికలో వచ్చింది. వర్తమాన సామాజిక ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక వైరుధ్యాలు సమాహార రూపానికి ఒక కథా దర్పణం 'యజ్ఞం'. శ్రీకాకుళానికి 15 కిలోమీటర్ల దూరంలో వున్న సుందరపాలెం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ పల్లెటూరితో పాటు, అక్కడ వున్న వ్యక్తుల జీవన విధానాలను, మనస్తత్వాలను ఉత్తరాంధ్ర మాండలిక భాషను చిత్రీకరించారు కారా.

దళిత రైతు అప్పల్రాముడు దళారి గోపన్న దగ్గర, అవసరం కోసం కొంత సొమ్ము అప్పు తీసుకుంటాడు. యేళ్ళ తరబడి వడ్డీతో ఆ అప్పు చాలా పెరిగిపోతుంది. ఇవ్వడానికి అప్పల్రాముడి దగ్గర డబ్బులు వుండవు. చివరకు ఈ సమస్య ఆ ఊరి పెద్ద మనిషి శ్రీరాములు నాయుడు దగ్గరకు చేరుతుంది. ఈలోపు అప్పల్రాముడి అప్పును తామే చెల్లించి, అతనితో వెట్టిచాకిరి చేయించుకోవడానికి కొందరు పెద్దలు పన్నాగం పన్నుతారు. ఎవరు ఏమి మాటలాడినా అప్పల్రాముడు మాటలాడడు. ఏమి చేయాలో తెలియక చివరకు అప్పల్రాముడి అప్పును, నేను తీరుస్తానంటాడు శ్రీరాములు నాయుడు. అప్పుడు అప్పల్రాముడు నోరు విప్పుతాడు.

తరతరాల నుంచి జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను, దౌర్జన్యాలను, మోసాలను, దోపిడీలను, పూసగుచ్చినట్లు చిట్టా విప్పి చెబుతాడు. ఆ మాటలతో ఊరి జనం చైతన్యవంతులవుతారు. అప్పల్రాముడు చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజమే కదా! అనుకుంటారు. తన అప్పును ఎవ్వరూ తీర్చవలసిన అవసరం లేదని, తానే కొంచెం పొలం అమ్మి తీర్చుతానంటూ కుండ చెప్పుతాడు అప్పల్రాముడు. కరణాన్ని పత్రం రాయమంటాడు. అప్పల్రాముడి కొడుకు సీతారాముడు, తండ్రి మాటలకు అడ్డుపడతాడు. బతికినంత కాలం చాకిరీ చేసి, గోపన్న అప్పు తీరుస్తాను కానీ, పొలం కాసింతైనా అమ్మడానికి వీలులేదని కరాఖండిగా చెబుతాడు. తన మాటకు కట్టుబడి శ్రీరాములు అమ్మకం పత్రం మీద నిశానీ పెట్టి, కొడుకుల చేత మనవళ్ళ చేత, నిశానీ వేయిస్తాడు. తన కొడుకు తనలాగ జీవితాంతం వూడిగం చేయడం ఇష్టం లేక సీతారాముడిని నరికి గోతంలో వేసుకుని ధర్మమండపం ముందు దభాలున పడేస్తాడు అప్పల్రాముడు. దీనితో కథ ముగుస్తుంది.

తీర్పు న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా లేనప్పుడు, తను ఏమీ చేయలేనని నిర్ధారణకు వచ్చినప్పుడు ఫ్యూడల్ వ్యవస్థపై నిరసనగా, బానిస బతుకు మీద తిరుగుబాటుగా అప్పల్రాముడు తన కన్న కొడుకును చంపుకుంటాడు. అతడు అలాంటి కఠినమైన ఉన్మాద స్థాయికి తీసుకెళ్ళిన పరిస్థితులను మనం 'యజ్ఞం' కథలో చూస్తాం. ఈ కథలో దోపిడీశక్తుల బండారం బట్టబయలు చేస్తాడు కథకుడు. దళిత రైతుల పరిస్థితులను వున్నది వున్నట్లు శక్తివంతంగా చిత్రీకరించాడు. మనిషి తను ఏమీ చేయలేనప్పుడు, కోపం పెనుతుఫానుగా పెల్లుబికినప్పుడు తనను తాను హింసించుకుంటాడు. అదొక ఉన్మాదస్థితి. పరిస్థితులు తారుమారు అయినప్పుడు తాను అనుకున్నది అనుకున్నట్లుగా జరగనపుడు కలిగే పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఈ కథ ముగింపులో మనం అదే చూస్తాం. ఇక్కడ కథకుడు బలంగా గట్టిగా చెప్పదలచుకున్నది ఏమంటే బానిసగా జీవితాంతం వెట్టిచాకిరీ చేస్తూ ఈ సమాజంలో ఏ ఒక్కడూ బతకకూడదనే. సమాజంలో ఆర్థిక సామాజిక వ్యత్యాసాలు ఏర్పడడానికి గల కారణాలను విశ్లేషణాత్మకంగానూ, వివేచనాత్మకంగానూ రాసిన కథ ఇది. ఈ కథ మీద అనేక వాదోపవాదాలు జరిగాయి.

దళితుల జీవన నేపథ్యాన్ని తీసుకుని 'ఆర్తి' కథ కారా. ఈ కథలో కథకుని సామాజిక దృక్పథం చాలా స్పష్టంగా కన్పిస్తుంది. సన్ని, పైడయ్య భార్యాభర్తలు. కుటుంబ తగాదాల వల్ల దంపతుల బంధం దూరమయ్యే పరిస్థితి వస్తుంది. సన్ని తల్లి ఎర్రమ్మ, పైడయ్య తల్లి బంగారి ... మధ్య గొడవలు సన్ని, పైడయ్యల ఎడబాటుకు ప్రధాన కారణమవుతుంది. ఎర్రమ్మ తన కూతురు సన్నిని పండగకు ముందు అత్తవారి ఇంటికి పంపడానికి ఇష్టపడదు. కారణం పండగ ముందు కూలిపనులు ఎక్కువగా వుంటాయి. కూతురు తన దగ్గర వుండే కూలి చేస్తే డబ్బులు వస్తాయని ఆమె ఆశ. బంగారి కూడా తన కోడలు తన ఇంటికి వస్తే కూలి పనులు చేసి డబ్బులు సంపాదించవచ్చునని భావిస్తుంది. ఇక్కడ వారిద్దరి ముఖ్యమైన సమస్య ఆర్థికాంశమే! మనిషి జీవితంలో ప్రధాన సమస్య ఆకలి. ఆకలి వీళ్ల మధ్య పెద్ద చిచ్చు రేపుతుంది.

ఊరు పెద్ద అసిర్నాయుడు ఈ తగువుకు తీర్పు ఇస్తాడు. సన్నీ, పైడయ్య కలిసి వుంటే మంచిదని చెబుతాడు. ఎర్రమ్మకి అన్ని విధాలా నచ్చ చెప్పి, వియ్యపురాలు బంగారితో కలిసి మెలిసి, కలుపుగోలుగా వుంటే కలిగే ప్రయోజనాలను వివరంగా తెలియజేస్తాడు. ఇద్దరికీ సయోధ్య చేస్తాడు. చివరకు వియ్యపురాళ్ళు ఇద్దరూ కలుస్తారు. ఈ బంధం తాత్కాలికమా? శాశ్వతమా? అనే సంశయాలతో కథ ముగుస్తుంది. దళితుల సామాజిక ఆర్థిక మానవీయ కోణాలు ఈ కథలో కనిపిస్తాయి.

చావు కథ 'సృజన' మాసపత్రికలో 1971 మార్చిలో వెలువడింది. నారమ్మ అనే దళిత ముసల్ది చనిపోతుంది. ఆమెను దహనం చేయడానికి అవసరమైన కట్టెల కోసం పడిన కష్టాలే ఈ కథలోని ఇతివృత్తం. కులాల మధ్య వ్యత్యాసాలు, పేద ధనికుల మధ్య తారతమ్యాలు; పెత్తందారుల అహంకారం, ప్రకృతి వనరులను అప్పనంగా దోచుకోవడం, దళిత జనాలను ఇంకా బానిసలుగా తయారు చేయడానికి ప్రయత్నించడం ... ఈ కథలో చర్చకు వస్తాయి. అభ్యుదయ, విప్లవ దృక్పథం వున్న యువకులు తమ హక్కుల సాధన కోసం ఎంతవారినైనా ఎదురు తిరుగుతారనీ, ఏకమై పోరాడతారనీ, దళిత చైతన్యాన్ని కలిగిస్తారనిఈ కథలో చెబుతారు.

అక్కివరం మాలపేటలో సావాలు, ఎరకయ్య దంపతులు ఉంటారు. వీరికి ఆరుగురు సంతానం. పెద్ద కొడుకు (పేరు లేదు), పోలమ్మ, నారెమ్మ, సిమ్మాద్రి, దాలి, ఆఖరి కొడుకు పేరు పెంటగాడు. ఈ కుటుంబంలో దారిద్ర్యం విలయతాండవం చేస్తుంది. ముసలివాళ్ళను, చిన్నపిల్లలను ఇంటిలో వొదిలిపెట్టి ఇంటిల్లపాది కూలిపనికి వెళ్ళిపోతారు. ఉదయం వెళ్ళితే రాత్రికే వస్తారు. మధ్యలో వెళితే కూలి పోతుంది.

దళిత ముసల్ది నారమ్మ చనిపోతుంది. సిమ్మాద్రి, వాళ్ళ అమ్మకు, నాన్నకు నాయనమ్మ నారమ్మ చనిపోయిన విషయం తెలియజేయదు. చెప్పకపోవడానికి కారణాలు వున్నాయి. అంతకుముందు రెండు మూడుసార్లు ఆమెకు బాగా లేకపోతే చనిపోయిందని భావించి, వెళ్ళి చెబితే అమ్మనాన్న పని వదలివేసి ఇంటికి వస్తారు. పని మధ్యలో ఆపేసి వచ్చారు కాబట్టి, యజమాని కూలిడబ్బులు ఇవ్వడు. పొద్దున్నే అయితే ఏ కబురైనా చెప్పు, మధ్యాహ్నమైతే కబురు పంపవొద్దని చెల్లెలు పోలమ్మ, అక్క సిమ్మాద్రితో ఇంతకుముందే చెబుతుంది. ఆ కారణంగా నారమ్మ చనిపోయిన సంగతి, సిమ్మాద్రి ఎవరికీ చెప్పకుండా ఊరుకుంటుంది.

నారమ్మ ఎప్పటి నుంచో అనారోగ్యంతో బాధపడుతుంది. దానికితోడు విపరీతమైన చలి. కప్పుకోవడానికి దుప్పటి కూడా వుండదు. ఇంటిలోని గుడ్డలన్నీ కప్పుకుంటుంది. సరిపోకపోతే, గోనె సంచులు కప్పుకుంటుంది. అయినా తీవ్రమైన చలిని భరించలేక చచ్చిపోతుంది. సిమ్మాద్రికి కూడా చలి వేస్తుంది. కప్పుకోవడానికి గుడ్డలు వుండవు. ఇంటిలోని గుడ్డలన్నీ నారమ్మ శవం మీదే వుంటాయి. చలిని భరించలేక శవంపై కప్పివున్న గుడ్డలు తీయడానికి ప్రయత్నిస్తుంది. వారి పరిస్థితి ఎంత దారుణంగా వుందో దీని బట్టి మనకు అర్ధమవుతుంది.

సాయంత్రం అందరూ ఇంటికి చేరుకుంటారు. శవాన్ని బయటకు తీస్తారు. ఆ పేటలోని జనమంతా చేరుతారు. అంత్యక్రియల కోసం ప్రయత్నాలు ప్రారంభిస్తారు. కాల్చడానికి కట్టెలు లేవని కోడలు సావాలు అంటుంది. కట్టెలు దొరక్కపోతే పాతిపెట్టడమే మంచిదని పొరిగింటి లచ్చయమ్మ సలహా ఇస్తుంది. కట్టెల కోసం నాయుడు గారింటికెళితే ఆయన భార్య, చలిలో కుదరదని రేప్పొద్దున రమ్మని తలుపు వేసుకుంటుంది. మరో ఇద్దరు ముగ్గురి దగ్గరకు వెళ్ళినా పని జరగదు.

శవాన్ని కాల్చడమే ధర్మమనీ, లేకపోతే జీవుడు దెయ్యమౌతాడని అప్పారావు అంటాడు. ప్రతి ఇంట పశువులను కట్టే కొయ్యను సేకరిస్తే, శవదహనానికి సరిపోతుందని చెబుతాడు. దానికి పెద్దలు అంగీకరించరు. ఆ పని దొంగతనం కిందకు వస్తుంది కాబట్టి మనం ధర్మమార్గంలో నడుద్దామంటారు. చివరకు శవాన్ని పాతిపెట్టడానికి, సిద్ధపడి శ్మశానానికి తీసుకెళతారు. అక్కడ గొయ్యి కూడా తీసి రడీగా వుంచుతారు.

ఈలోపు ఎరకయ్య పెద్ద కొడుకు సీతయ్య, మరికొంతమంది యువకులు తెగించి పందిరి అప్పయ్య కళ్ళంలో వున్న కట్టె మోపులను తీసుకువచ్చి, పెద్దల ముందు పడేస్తారు. ఆ కట్టెలతో తన తల్లి నారమ్మ శవాన్ని ఎరకయ్య దహనం చేస్తాడు. అతడి మొఖంలో ఎంతో ప్రశాంతత కన్పిస్తుంది. రేప్పొదున్న ఈ యువకులను దొంగలుగా నిందిస్తే అది తన తప్పేనని, తనను శిక్షించమని అడుగుతానని నిర్ధారించుకుంటాడు. సూరయ్య అనే పేట పెద్ద మనిషి ద్వారా కథకుడు ఈ కథను వివరిస్తాడు. డబ్బుగల వాళ్ళు చనిపోతే దీపాలు, దహనానికి గంధపు చెక్కలు, ఆవు నెయ్యిలాంటి ఆడంబరాలు వుంటాయి. అదే పేదలు చనిపోతే శవం వద్ద చనిపోయిన వాళ్ల గురించి చెప్పుకునే కబుర్లు, కథలే వుంటాయని పేర్కొంటాడు. అప్పారావు పాత్ర ద్వారా కథకుడు అభ్యుదయ భావాలు పలికిస్తాడు. అవసరమైతే పెద్దలను ఎదిరించాలని అంటాడు. ఇంకా ఎన్నాళ్ళు ఇలా పెద్ద వాళ్ళ కాళ్ళ కింద పడివుండాలని నిలదీస్తాడు. ఆ ప్రభావంతో సూరయ్య ఆలోచనల్లో మార్పు వస్తుంది. భారతదేశంలో దళితులకు బతుకే కాదు చావు కూడా అత్యంత సమస్య అని చెప్పిన కథ ఇది. దళితుల సుదీర్ఘమైన వాస్తవిక జీవిత సమస్యల్ని ప్రతిభావంతంగా చిత్రించిన కథ 'చావు'. స్వాతంత్ర్యం వచ్చి డబ్బై ఐదు ఏళ్లు అయినా దళితుల బతుకు ఇలాగే వుంది. వర్గ దృష్టితోనూ, సామాజిక దృక్పథంతోనూ, దళిత చైతన్యంతోనూ, ఆర్థిక విధానంతోనూ లోతుగా పరిశీలిస్తే 'యజ్ఞం' కంటే 'ఆర్తి', దానికంటే 'చావు' క్రమంగా పరిణతి చెందిన వైనాన్ని మనం గమనించొచ్చు.

(నవంబరు 9 : కారా మాస్టారి జయంతి)

– ఆచార్య వెలమల సిమ్మన్న
94406 41617

మనసును తాకే 'సరూ'

రసజ్ఞ జాతీయ నాటక ఉత్సవం 2022 లో భాగంగా అక్టోబరు 28వ తేదీన విశాఖలోని కళాభారతి ఆడిటోరియంలో – మధ్యప్రదేశ్‌కు చెందిన ఇంద్రావతి థియేటర్ ప్రదర్శించిన విభిన్నమైన నాటకం 'సరూ.' ఇది హిజ్రా పాత్రలతో నడిచిన మానవీయ ప్రదర్శన. ఇన్నాళ్లూ మనలోని చాలామంది ఆలోచనా పరిధిలోకి రాని అంశాలను చాలా గొప్ప ప్రదర్శనాభివేశంతో కళ్ల ముందుంచిన నాటకం. ప్రేక్షకుల గుండెల్లో ఒక చెమరింపుని, హృదయంలో ఒక మానవీయ స్పర్శనూ కలగించిన ప్రదర్శన ఇది.



నాటకం ఇతివృత్తం ఇదీ.. : రోజులు మామూలుగా నడుస్తున్న సమయంలో ఒకరోజు హిజ్రా అయిన సుశీలకు చెత్తకుప్ప తొట్టెలో ఒక ఆడ శిశువు కనిపిస్తుంది. ఇంటికి తీసుకువస్తే తన సంరక్షకురాలు అయిన 'అమ్మ'– 'మనమే ఇటు అటు కానీ మూడో రకం మనుషులం. ఈ బిడ్డ పెరిగి పెద్దయితే మనలాగే అడుక్కుంటుందా?' అని ప్రశ్నించి ఎక్కడ దొరికిందో అక్కడే వదిలి రమ్మంటుంది. అది వాళ్ళిద్దరి మధ్యా వాదోపవాదాలకు దారి తీసి చివరకు అమ్మ, ఆ శిశువును తమతో ఉంచుకోవడానికి అంగీకరిస్తుంది. రోజులు మామూలుగా గడుస్తుంటాయి.

ఒకరోజు ఆ ఆడబిడ్డ స్కూలు నుంచి తిరిగి రాకపోవడంతో అందరూ ఆందోళన చెందుతారు. సుశీల ఆ విషయం పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ చేయడానికి వెళుతుంది. అక్కడ పోలీసు ఆమెతో చాలా అమర్యాదగా వ్యవహరిస్తారు. ఫిర్యాదు తీసుకోవడానికి చిరునామా, తల్లిదండ్రుల పేర్లు వగైరా అడుగుతాడు. తల్లీ తండ్రిగా ఆడపేర్లు చెప్పేసరికి 'ఎప్పటినుంచి మూడో రకం (ట్రాన్స్ జెండర్) మనుషులు కూడా బిడ్డలను కంటున్నారని' హేళన చేస్తాడు. ఆమెతో అసభ్యంగా వ్యవహరించి, శారీరకంగా హింసించి పంపేస్తాడు. ఇంటికి వెళ్తున్న తోవలో రోడ్డు పక్కన, పసి బాల 'సరూ' రక్తమోడుతున్న శరీరంతో కనిపిస్తుంది. ఇంటికి తీసుకెళ్ళిన కొద్దిసేపటికి సరూ కళ్ళు మూస్తుంది. ఇంటిలో దు:ఖ వాతావరణ అలుముకొంటుంది. చివరలో ఆ మూడో రకం మనుషులకు సరూ హంతకుడెవరో తెలుస్తుంది. వాళ్లు అతడిని మట్టికరిస్తారు.

ఈ నాటిక మూడో రకం మనుషుల జీవితాలు ఎలా ఉంటాయో, వాళ్ళ బాధలు, పైకి కనిపించని మానసిక గాయాలను చూపే ఒక మచ్చు తునక. ఈనాటికీ కొందరు తమ ఇళ్ళలో జరిగే వేడుకలకు ఈ మనుషులు వచ్చి ఆశీర్వదించాలని ఆశిస్తారు కానీ, వారికి గౌరవం, సమాన హక్కులు ఇవ్వడానికి ఇష్టపడరు. వారి కన్నీళ్లు, వీళ్ళ నవ్వుల మధ్య ఎక్కడో ఆవిరి అయిపోతాయి. వీళ్ళు తమ కష్టాలు బాధలు అవమానాలను, కన్నీళ్ళను, రంగు పులుముకున్న ముఖంలో ఎక్కడో కనబడకుండా దాచేస్తారు.

ఇప్పటికీ అనాధ ఆడ శిశువుల జననం ఈ సమాజంలో ఒక విషాదమే. ఒక కళంకమే! అయితే గర్భస్రావం లేదా కుప్ప తొట్టి పక్కనో, ప్రసవించబడి, 'వ్యర్థం'లా వదిలేయబడ్డ శరీర మలిన శరీరాలు మనకు కనిపిస్తుంటాయి.

ఈ నాటికలో ఈ వర్గం వారు అలాంటి శిశువును ఇంటికి తీసుకురావడానికి కారణం– చదివించి ఆ శిశువు కోసం బంగారు కలలు కనడం ఎందుకోసమంటే– ఇకనైనా ఈ సమాజం తన ఆలోచనా సరళిని మార్చుకొని తమతో కలుపుకుంటుందేమోనని ఒక ఆశతో! కానీ ఈ సమాజంలోని కొందరు నరరూప రాక్షసులే సరూ లాంటి వాళ్లను లైంగిక హింసలు పెట్టి, రక్త గాయాలతో పెంటదిబ్బల పైకి విసిరేస్తుంటారు. ఇది వెలిగిపోతున్న వర్తమాన సమాజంలోని ఒక గాఢాంధకార పార్శ్వం. మూడో వర్గం వారి యథార్థ జీవన శకలం. ఆ బిడ్డ పెంపకాన్ని మొదట్లో తిరస్కరించిన ఆ ఇంటి పెద్దని సరూ మరణం తీవ్రంగా కలిచివేస్తుంది. ఆమె గుండెలు బాదుకుని రోదిస్తుంది. అందరూ నిస్త్రాణగా కుప్పకూలిపోతారు. ఆ సమయంలో ఆమెలోని తల్లి హృదయం ఆక్రోశిస్తుంది. దేవుడిని శపిస్తుంది. ఏనాడూ తన జీవితం ఇలా అయినందుకు ఆమె భగవంతుడిని నిందించలేదు. కానీ ఇప్పుడు ఆ బిడ్డకు జరిగిన ఘోర అన్యాయానికి తీవ్రంగా స్పందిస్తుంది. చివరగా సరూని బలాత్కారం చేసింది పాఠశాల వాచ్‌మేన్ అని తెలుసుకొని, అతడిపై తమ కసినంతా ప్రదర్శిస్తూ వాడి ప్రాణాలు తోడేస్తారు. తమ ఆవేదన చల్లారక బిగ్గరగా అరుస్తూ ప్రచండ రూపాన్ని ప్రదర్శిస్తారు.

నాటిక ప్రదర్శకులు ఒక వైవిధ్యభరితమైన ఇతివృత్తాన్ని నట శిక్షణకు తీసుకున్న మామూలు విద్యార్థులు. ఆ మూడో రకం మనుషుల్లోని మానవత్వాన్ని, దు:ఖావేశాలను, సహానుభూతిని అత్యంత అద్భుతంగా ప్రదర్శించారు. అందరూ మగవారైనా... అభినయ ప్రదర్శనతో ప్రేక్షకుల్లో చక్కని స్పందన కలిగించడం ఈ నాటిక సాధించిన సామాజిక ప్రయోజనంగా చెప్పుకోవచ్చు. నాటిక రచన, దర్శకత్వం : శివ్ నారాయణ్ కుందేర్.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

సర్వజనీన కవిత్వం!

"భారతదేశంలోని సంపద సహజవొనరులపై ప్రతి మనిషికి హక్కు ఉంటుంది. వీటిని అందరూ సమానంగా అనుభవించిన రోజే ఈదేశానికి నిజమైన స్వతంత్ర్యం వచ్చినట్లు .." – ప్రొఫెసర్ మధు దండావతే.

కపాకర్ మాదిగ రచించిన 'పంచుకుందాం రా!' కవితా సంపుటి 127 కవితల సమాహారం. 295 పేజీల పుస్తకం. ఈ కవితా సంపుటికి డా॥ ఎండ్లూరి సుధాకర్, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, జూపాక సుభద్ర, బి.ఎస్.రాములు, జి.లక్ష్మీనర్సయ్య లాంటి మేధావులు ముందుమాటలు రాశారు.

పుస్తకం



కవి పొనుగోటి కృపాకర్ బాలకార్మికునిగా జీవితాన్ని ప్రారంభించాడు. మార్క్సిస్టు – లెనిస్టు ఉద్యమంలో ఆర్గనైజరుగా పనిచేశాడు. తరువాత మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక కార్యదర్శిగా ప్రస్థానం కొనసాగిస్తూనే మరోకపక్క సాహిత్య రచన విస్తృతంగా కొనసాగించాడు. తన ఉద్యమ ప్రస్థానం ప్రారంభం నుంచి నేటి వరకు అనేక కవితలు, వ్యాసాలు రాశాడు. వాటిలో కొన్నింటితో పంచుకుందాం రా! కవితా సంపుటి వెలువరించారు.

"గుడిసెల్లో చమురు దీపాలు/ నీడల్ని వొణికిస్తుంటాయి/ పక్షులు వేకువని పాడతాయి/ నేను విముక్తిని, భూపాలాన్నీ/ బిగ్గరగా పాడతాను' .. ఇలా మనిషిని మనిషి తాకకూడదనే అంటరానితనమనే మాయారోగం గురించి 'కైదుపాట' కవితలో వినిపించారు. 'అంటరానితనం రాత్రిలోకి ప్రవహిస్తుంది / నన్ను లాకప్ చేస్తుంది/ నాకు నేను ఆయుధాన్నై పదునెక్కుతాను/ ఈ ఇరుకు గదుల్ని మళ్ళీ మళ్ళీ పగలగొడతాను' అని పేర్కొన్నాడు. ఇక్కడ ఒక ఆవేశం, ధిక్కారం కనబడుతుంది. అక్షరాలు మరఫిరంగులై, అక్షరగోళాలై దుర్మార్గమైన ఈ సమాజాన్ని హెచ్చరిస్తున్నాయి. ఈ కవితలో గుడిసెల్లో చమురు దీపాలు నీడల్ని వొణికిస్తుంటాయి అని కవి తను తాను దశ్యమానం చేశాడు. ఇంట్లో గుడ్డిదీపం వెలిగించుకున్నప్పుడు అది గాలికి ఊగుతూ ఉంటుంది. అప్పుడు నీడలు ఊగిసలాడక ఏం చేస్తాయి మరి? ఈ సందర్భం దళిత జీవితాలకు ప్రతీక. 'నడిచే దీపస్తంభం నాన్న' కవితలో కవి అసలు సిసలైన మాదిగ అలంకారాలను గుదిగుచ్చి పాఠకుల ముందుంచాడు. అచ్చమైన స్వచ్ఛమైన వాడ భాషను వాడాడు. కొరముట్లు, పొలిగట్టే, పొగ్రు, నిట్టాడు... ఇవి ముచ్చుకు మాత్రమే! కవితలో లీనమైన పాఠకుడు అనివార్యంగా కవితను చివరివరకు ఆస్వాదిస్తాడు.

'నువ్వు గొడ్డు తోలు వలుస్తుంటే ఏ జనరల్ సర్జనూ సరిపోడేమో!/ చింత గింజలు జిగురుగా ఉడకేసి, కొత్త తప్పెట పలక జేసి/ కొత్త కొత్త శైలులతో నువు దురువులు వాయిస్తుంటే చూడాలి నానా!' ఇలా హృద్యంగా చెప్పుకుంటూ పోతాడు. కరక్కాయ పరిమళాన్ని ఊరికి కిర్రు చెప్పుల లయను తన అక్షరాలతో కవిత్వం చేసి నడిపించాడు కపాకర్. మిగ్గొమ్మిలోంచి వచ్చిన ఆరె చురుకుదనం, పన్రాయి మీద నూరిన పనికత్తి మెరుపుదనాన్ని తన అక్షరాల్లో పొదిని పట్టుకొని తన కవిత్వాన్ని వినిపించాడు. 'పంచుకుందాం రా!' కవితలో సమాజానికి ఓ సందేశం పంపాడు. భారతదేశంలోని సంపద సహజ వనరులపై హక్కు ఈ దేశంలో పుట్టిన ప్రతివారికి ఉంటుంది కనుక ఇద్దరి మధ్య కానీ, రెండు సామాజిక వర్గాల మధ్య కానీ, అనేక సమూహాల మధ్య వివాదం సడలాలి అంటే సంపదగానీ సామాజిక ఉన్నతి కాని ఒకరి దగ్గరే పోగుపడి ఉండకూడదని కవి భావన.


'అంబేద్కర్ రొట్టెలో భాగం పంచాల్సిందే అంటాను గట్టిగా' అని నొక్కినొక్కాణిస్తాడు కపాకర్. సంపద సమ భాగాలుగా పంచుకొంటే జాతుల మధ్య ఐకమత్యం పోతుందనే మాటలు ఆసంబద్ధమైనవని కవి భావన. పంచుకోవడం వల్ల ప్రపంచం ఏమీ మునిగిపోదు. ఆఖరి బంతిలో వారు కూడా కడుపునిండా తిన్ననాడే అసలైన బాబా సాహెబ్ ఆలోచనా విధానం నెరవేర్చినట్టని కవి హృదయం. 'నిర్భయ' కవితలో ప్రతి వాక్యమూ ఓ ధిక్కార నిప్పుకణిక. 'రాతి కత్తితో ఈటె కట్టెతో/ ఇనుప బరిసెతో రాజ్యం చేసిన దానను/ అయినా నేను మానవిని/ మహా ఆదిని/' అంటూ స్త్రీని ఓ పరాశక్తిగా చూపించాడు కవి. 'సూర్యచంద్రులను రెండు కళ్ళగా జ్ఞానాన్ని మూడో కన్నుగా కలిగిన దానను/ మానవిని, మహా ఆదిని' అనిస్త్రీజాతిని ఆకాశమంత ఎత్తులో నిలిపాడు. సినారె, శిఖామణి, ఎండ్లూరి సుధాకర్, దార్ల వెంకటేశ్వరరావు, ప్రతాప్ కుమార్ .... ఇలా ఎంతోమంది కవులు అమ్మ గురించిన కవితలు రాశారు. స్త్రీని మానవిని, మహా ఆదిశక్తిగా నిలిపి చరిత్రలో నిలిచిపోయాడు కపాకర్.

ఓ కవి పేరు చెప్పగానే ఆయన ఉద్యమ కవనీ, లేదా రైతుకవి, దళిత కవి .. అంటూ ఏదొక ముద్ర పడుతుంది. ఈ కవితా సంపుటి చదివిన తర్వాత పాఠకులు ఈ కవిని ఏదో ఓ గాట కట్టిపడి వేయలేరు. ఇందులో పదీ పన్నెండు మాత్రమే దళిత కవితలు. మిగతావన్నీ వివిధ సామాజిక అంశాలపై రాసినవే! కృపాకర్ ఓ సామాజిక తత్వవేత్త, ఉద్యమాల ఉపాధ్యాయుడు. సర్వజనీన కవిత్వం తనది.

– దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి
70139 75274

సంపన్నులపై పన్నులు

- అసమానతలు పెంచుతున్న పాలకుల విధానాలు
- కేంద్ర నిధులు కిందిస్థాయికి చేరాలి
- నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ



న్యూఢిల్లీ : ఎన్నికలవేళ ఉచిత పథకాల ప్రకటన కన్నా.. ధనికులపై పన్నులు పెంచాలని నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ సూచించారు. భారత్‌లో పాలకులు ఎంచుకున్న ఆర్థిక విధానాలు అసమానతల్ని మరింత పెంచుతున్నాయని, కేంద్ర నిధులు కిందిస్థాయికి వెళ్లేలా చర్యలు చేపట్టాలని అన్నారు. న్యూఢిల్లీలో ఏర్పాటుచేసిన ఒక సమావేశంలో 'గుడ్ ఎకనామిక్స్, బ్యాడ్ ఎకనామిక్స్' అనే అంశంపై మాట్లాడుతూ ఆయన పై వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ప్రకటించే ఉచిత పథకాలతో పేదలకు మేలు జరగదన్నారు. అసమానతలు తగ్గించడానికి, పేదలకు మేలు చేయడానికి ఉచిత పథకాలు సాయం చేయవని చెప్పారు. అసమానతలు, పేదరికాన్ని ఎదుర్కోవాలంటే సరైన ఆర్థిక విధానాలు, క్రమశిక్షణ అవసరమన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మహిళల ఆర్థిక స్వేచ్ఛ.. తదితర అంశాలపై అభిజిత్ బెనర్జీ తన అభిప్రాయాల్ని పంచుకున్నారు.

"ఎన్నికల సమయంలో ఉచిత పథకాలు ప్రకటించటం అలవాటై పోయింది. ఇప్పుడు దాని నుంచి బయటపడటం చాలా కష్టమైన ఆట. అత్యంత ధనికులు, బడా కార్పొరేట్లు తీసుకున్న బ్యాంకు రుణాలు మొండి బకాయిలుగా మారుతున్నాయి. అతిపెద్ద రుణ గ్రహీతలెవరూ పేదవారు కాదు. మనకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వ నిధులు కిందిస్థాయికి వెళ్లేలా ప్రణాళిక చేయాలి" అని అన్నారు.

అసమానత్వం విజృంభిస్తోంది..

నిజమైన వేతనాలు పడిపోతున్నాయి. చిన్న కార్లకు డిమాండ్ తగ్గిపోయింది. లగ్జరీ కార్ల విభాగాలు అమ్మకాలు అనూహ్యంగా పెరిగాయి. ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా ఇంధన ధరలు మండిపోతున్నాయి. నిత్యావసర వస్తువుల ద్రవ్యోల్బణం పేదలపై ప్రభావం చూపుతోంది. ఇప్పుడు మనం అసమానతలు పెరిగే దశలో ఉన్నాం. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి మేక్ ఇన్ ఇండియా మొదలుపెట్టాం. 98శాతం అభ్యర్థులు ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. యువతలో పెద్ద ఎత్తున నిరుద్యోగం నెలకొంది.

రేపు సిజెఐగా జస్టిస్ యుయు లలిత్ పదవీ విరమణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిజెఐగా జస్టిస్ యుయు లలిత్‌కు సోమవారం చివరి పనిదినం కావడం సుప్రీంకోర్టులో ఉదయం 10:30 గంటలకు సెరిమోనియల్ బెంచ్ సమావేశం కానుంది. సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారం ఇస్తారు. సోమవారం జస్టిస్ యుయు లలిత్, కాబోయే సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ బీలా ఎం త్రివేదిలతో కలిసి ధర్మాసనంలో కూర్చోనున్నారు. ఆయన మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. మంగళవారం గురునానక్ జయంతి సందర్భంగా సుప్రీం కోర్టుకు సెలవు. దాంతో సోమవారమే సెరిమోనియల్ బెంచ్ కూర్చుంటుంది. జస్టిస్ యుయు లలిత్ స్థానంలో జస్టిస్ చంద్రచూడ్ సిజెఐగా బాధ్యతలు స్వీకరిస్తారు.

ఉత్తరాఖండ్‌లో భూకంపం.. రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రత నమోదు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో ఆదివారం ఉదయం స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్ పై 4.5 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. తెహ్రీ కేంద్రంగా భూకంపం వచ్చింది. రాజధాని డెహ్రాడూన్‌తోపాటు ఉత్తరకాశీ, బర్కోట్, తెహ్రీ, ముస్సోరీలలో కూడా భూప్రకంపనలు వచ్చాయి. దీనివల్ల ఎటువంటి నష్టం సంభవించినట్లు సమాచారం లేదు. ఇటీవల కాలంలో హిమాలయ రాష్ట్రాల్లో ఎక్కువగా భూకంపాలు సంభవిస్తున్నాయి. తీవ్రత తక్కువగా ఉండటంతో పెద్దగా నష్టం జరగడం లేదు. ఇండియన్ టెక్టానిక్ ప్లేట్ నిరంతరం ఉత్తరం వైపుగా కదులుతుండటంతో హిమాలయాల్లో తరుచుగా భూకంపాలు వస్తుంటాయి.

గుజరాత్‌లో పోటీ నుంచి వైదొలగాలని బిజెపి ఒత్తిడి

- ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ : గుజరాత్ ఎన్నికల నుంచి వైదొలగితే ఢిల్లీ మంత్రులపై అభియోగాలు ఎత్తివేస్తామంటూ బిజెపి ఓ ఆఫర్ ప్రకటించిందని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఢిల్లీ మంత్రులు మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లకు ఇడి కేసుల నుంచి విముక్తి కల్పిస్తామని, వారిపై అభియోగాలు ఎత్తివేస్తామని చెబుతున్నారని తెలిపారు. కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ గుజరాత్ ఎన్నికల్లో ఓటమి పాలౌతామని బిజెపి గ్రహించిందని, ఓటమి నుంచి బయటపడేందుకు శత విధాలా యత్నిస్తోందని అన్నారు. దీంతో మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లపై దాఖలైన కేసులు కల్పితాలని స్పష్టమైందని చెప్పారు.

15 మంది భారతీయ మత్స్యకారుల అరెస్టు

కొలంబో : శ్రీలంక నౌకాదళం 15 మంది భారతీయ మత్స్యకారులను అరెస్ట్ చేసింది. తమ ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా వచ్చినందున వారిని అరెస్ట్ చేశామని శ్రీలంక ఆదివారం విడుదల చేసిన అధికార ప్రకటనలో పేర్కొంది. మన్నార్ ద్వీపం వాయువ్య తీరంలో ఉన్న తలైమన్నార్‌లో మత్స్యకారులను శనివారం అరెస్ట్ చేసినట్లు శ్రీలంక నౌకాదళం వెల్లడించింది. 32వ అంతర్జాతీయ సరిహద్దు రేఖపై భారత్, శ్రీలంక నౌకాదళాలు, కోస్ట్ గార్డ్ చర్చలు జరుపుతున్నాయని నౌకాదళం తెలిపింది.

గుజరాత్‌లో మోడీ ప్రచారం ప్రారంభం

గాంధీనగర్, సిమ్లా : గుజరాత్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తరువాత ఆ రాష్ట్రంలో బిజెపి ఎన్నికల ప్రచారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. కప్రదలో శుక్రవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మోడీ మాట్లాడుతూ 'ఐ హెవ్ మేడ్ దిస్ గుజరాత్' నినాదం ఇచ్చారు. 'ప్రతీ గుజరాతీ కూడా ఈ రోజు చాలా ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు. ఆదివాసీ లేదా జాలరి లేదా గ్రామస్తుడు లేదా పట్టణంలో నివసించేవారు ఎవరైనా సరే చాలా ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఈ ప్రజలంతా కష్టపడి ఈ రాష్ట్రాన్ని నిర్మించుకున్నారు' అని మోడీ చెప్పారు. .

కాంగ్రెస్ ఎనిమిది హామీలు

గుజరాత్ ఎన్నికల నేపథ్యంలో ఎనిమిది వచనాస్ (హామీలు)ను కాంగ్రెస్ ఆదివారం సోషల్ మీడియాలో విడుదల చేసింది. అధికారంలోకి వస్తే వీటిని అమలు చేస్తామని తెలిపింది. గృహస్థులకు రూ.500 లకే ఎల్‌పిజి సిలిండర్లు, ప్రతి ఇంటికి నెలకు 300 యూనిట్ల వరకూ ఉచిత్ విద్యుత్, కెజి నుంచి పిజి వరకూ మహిళలకు ఉచిత విద్య, ఇంగ్లీష్ మీడియంతో 300 ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు హామీ ఇచ్చింది. యువతకు, కోవిడ్ బాధితులకు, ఆరోగ్య రంగంలో మౌలిక వసతులకు, రైతులకు, శాంతి భద్రతలకు, సామాజిక న్యాయం కోసం హామీలిచ్చింది.

యుసిసిని అమలు చేస్తాం
హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపి మ్యానిఫెస్టో

హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపి ఆదివారం తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. సిమ్లాలో బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా ఈ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. యూనిఫామ్ సివిల్ కోడ్ (యుసిసి)ని అమలు చేస్తామని, 8 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఎల్‌పిజి సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు.

ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడి

నాలుగు స్థానాల్లో బిజెపి, మూడు స్థానాల్లో ప్రతిపక్షాల విజయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని ఆరు రాష్ట్రాల్లో ఏడు అసెంబ్లీ స్థానాల ఫలితాలను ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ నెల 3న జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి నాలుగు స్థానాల్లో గెలుపొందగా, మూడు స్థానాల్లో ఓటమి చెందింది. తెలంగాణలో అధికార టిఆర్ఎస్, యుపి, హర్యానాల్లో అధికార బిజెపి, మహారాష్ట్రలో ఉద్ధవ్ శివసేన, ఒరిస్సాలో బిజెపి గెలిచాయి. బీహార్‌లో రెండు స్థానాలకు ఆర్‌జెడి, బిజెపి చెరొకటి సొంతం చేసుకున్నాయి.

బీహార్‌లోని మొకామా నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి సోనం దేవి (63,003)పై ఆర్‌జెడి అభ్యర్థి నీలందేవి (79,744) 16,741 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. గోపాల్‌గంజ్ నియోజకవర్గంలో ఆర్‌జెడి అభ్యర్థి మోహన్ ప్రసాద్ గుప్తా (68,259)పై బిజెపి అభ్యర్థి కుసుమ్ దేవి (70,053) కేవలం 1,794 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొకామా ఎమ్మెల్యే అనంత్ కుమార్ సింగ్‌పై ఎన్నికల కమిషన్ అనర్హత వేటు వేయడంతో ఆయన సతీమణి నీలం దేవి పోటీచేసి విజయం సాధించారు. బిజెపి ఎమ్మెల్యే సుభాశ్‌సింగ్ మరణించడంతో గోపాల్‌గంజ్ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. ఆయన సతీమణి కుసుమ్ దేవి పోటీ చేసి, గెలుపొందారు.

మహారాష్ట్రలోని తూర్పు అంధేరీ శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన అభ్యర్థి రుతుజ లట్కే ఘన విజయం సాధించారు. శివసేన ఎమ్మెల్యే రమేశ్ లట్కే ఈ ఏడాది మే నెలలో మరణించడంతో ఆయన సతీమణి రుతుజ లట్కే బరిలోకి దిగారు. కాంగ్రెస్, ఎన్‌సిపి, ఎంఎన్ఎస్ రుతుజకు మద్దతు పలికాయి. బిజెపి పోటీ చేయలేదు. రుతుజకు 66,530 ఓట్లు రాగా, నోటాకు 12,806 ఓట్లు వచ్చాయి. ఆమె 64,959 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) పార్టీ టార్చిలైట్ గుర్తుతో మొదటి సారిగా పోటీ చేసి గెలిచారు.



ఆర్‌జెడి అభ్యర్థి నీలందేవి

ఉత్తరప్రదేశ్, హర్యానా, ఒరిస్సాల్లో బిజెపి

ఉత్తరప్రదేశ్‌లోని గోలా గోకరణ్‌నాథ్ శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి అమన్ గిరి ఎస్‌పి అభ్యర్థి వినయ్ తివారిపై 34,298 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అమన్‌గిరి తండ్రి అరవింద్ గిరి మరణంతో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. హర్యానాలో అదంపూర్ శాసనసభ నియోజకవర్గంలో జెజెపి మద్దతుతో పోటీ చేసిన బిజెపి అభ్యర్థి భవ్య బిష్ణోయ్ కాంగ్రెస్ అభ్యర్థి జయప్రకాష్‌పై 15,740 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. భజన్ లాల్ కుమారుడు కుల్‌దీప్ బిష్ణోయ్ ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, బిజెపిలో చేరడంతో ఈ ఉప ఎన్నిక జరిగింది. కుల్‌దీప్ కుమారుడే భవ్య బిష్ణోయ్. ఒరిస్సా ధామ్ నగర్ శాసన సభ స్థానంలో బిజెపి అభ్యర్థి సూర్యబంషి సూరజ్ (80,351), బిజెడి అభ్యర్థి అబంతి దాస్ (70,470)పై 9,881 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బిజెపి ఎమ్మెల్యే బిష్ణు చరణ్ సేథీ మరణంతో ఉప ఎన్నిక జరిగింది. బిజెపి తన అభ్యర్థిగా సేథి కుమారుడు సూర్యబన్షి సూరజ్‌ను బరిలోకి దింపింది.

ఇడబ్ల్యుఎస్ కోటాపై నేడు సుప్రీం తీర్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి (ఇడబ్ల్యుఎస్) 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన 103 రాజ్యాంగ సవరణ రాజ్యాంగ చెల్లుబాటుపై సోమవారం సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వనుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్, న్యాయమూర్తులు జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ ఎస్.రవీంద్రభట్, జస్టిస్ బీలా ఎం త్రివేది, జస్టిస్ జెబి పార్దీవాలాలతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇవ్వనుంది. రిజర్వేషన్లకు ఆర్థిక వర్గీకరణ మాత్రమే ప్రాతిపదిక కాదనే కారణంతో ఈ సవరణను సవాల్ చేస్తూ జనహిత్ అభియాన్, యూత్ ఫర్ ఈక్వాలిటీ తదితర సంస్థలు పిటిషన్‌లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై వరుసగా ఏడు రోజుల పాటు సుదీర్ఘంగా విచారించిన సుప్రీంకోర్టు, సెప్టెంబర్ 27న విచారణ ముగించింది. ఈ సవరణ రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘిస్తోందని, ఇంద్ర సాహ్నీ కేసులో నిర్దేశించిన ప్రకారం మొత్తం 50 శాతం రిజర్వేషన్లను ఉల్లంఘించిందని పిటిషనర్లు వాదించారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు కాకుండా ఇడబ్ల్యుఎస్‌లకు 10 శాతం రిజర్వేషన్ ఏకపక్షంగా ఉందని తెలిపారు. అప్పటి అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ సవరణను సమర్థిస్తూ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఎక్కడా ఉల్లంఘించలేదని పేర్కొన్నారు.

టాంజానియాలో కుప్పకూలిన విమానం

19 మంది మృతి, 26 మందిని కాపాడిన సహాయక సిబ్బంది



డుడుమా : టాంజానియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. వాయువ్య నగరమైన బుకోబాలో ల్యాండ్ అవడానికి కొద్ది సేపటి ముందు ప్రతికూల వాతావరణంతో విక్టోరియా సరస్సులో ప్రెసిషన్ ఎయిర్ ఫ్లైట్ కూలిపోయింది. ఈ ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. 26 మందిని సహాయక సిబ్బంది రక్షించి ఆసుపత్రులకు తరలించారు. విమానంలో చిక్కుకున్న మిగతా వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. విమానంలో ఎంతమంది చిక్కుకుపోయారనే అంశంపై స్పష్టత లేదు.

43 మంది ప్రయాణికులతో టాంజానియాలోని డార్ ఎస్ సలామ్ నుంచి ఆ విమానం బయలుదేరినట్లు రీజనల్ కమిషనర్ తెలిపారు. రెస్క్యూ అధికారులు, స్థానిక మత్స్యకారులు విమాన ప్రయాణికులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. 'ప్రెసిషన్ ఎయిర్ ఫ్లైట్ ప్రమాదానికి గురైంది. ఎయిర్‌పోర్ట్‌కు వంద మీటర్ల దూరంలో ఉన్న నీటిలో పడిపోయింది. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయి. ప్రయాణికులను రక్షించేందుకు భద్రతా బందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.' అని రీజనల్ పోలీస్ కమాండర్ విలియమ్ వాంపఘేల్ తెలిపారు. పైలెట్లు ఇద్దరూ ప్రమాదం నుంచి బయటపడ్డా కాక్‌పిట్‌లో చిక్కుకున్నారు. వారితో స్థానిక అధికారులు మాట్లాడుతున్నారు. విమానంలో 49 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానిక మీడియా నివేదించగా.. ఆ సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రెసిషన్ ఎయిర్ సంస్థ టాంజానియాలో అతిపెద్ద ప్రైవేటు విమానయాన సంస్థ.

ప్రముఖ వైద్యులు సునీతకి జాతీయ పురస్కారం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె, ప్రముఖ వైద్యులు నర్రెడ్డి సునీత క్యాపిటల్ ఫౌండేషన్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. న్యాయ, వైద్యం, సైన్యం, ఆర్థిక, కళా రంగాల్లో విశేషమైన సేవలు అందించిన పలువురికి క్యాపిటల్ ఫౌండేషన్, జస్టిస్ కృష్ణయ్యర్ ఉచిత న్యాయసేవల విభాగంతో కలిసి జాతీయ అవార్డులు ప్రదానం చేసింది. ఆదివారం నాడిక్కడ ఇండో ఇస్లామిక్ కల్చరల్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ యుయు లలిత్ డాక్టర్ నర్రెడ్డి సునీతకు జాతీయ అవార్డును అందజేశారు. ఆమె వైద్య రంగంలో చేసిన సేవలకు గానూ క్యాపిటల్ ఫౌండేషన్ ఈ పురస్కారం ప్రదానం చేసింది. మాజీ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్‌కు జీవన సాఫల్య పురస్కారం, హైదరాబాద్‌కు చెందిన పురాతన కార్ల సేకర్త (కళా రంగం) రామ్‌లాల్ అగర్వాల్‌కు క్యాపిటల్ ఫౌండేషన్ జాతీయ పురస్కారాన్ని జస్టిస్ యుయు లలిత్ అందజేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 15 మందికి జాతీయ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ జస్టిస్ ఎకె పట్నాయక్, అటార్నీ జనరల్ వెంకటరమణి, వైసిపి ఎంపి రఘురామకృష్ణరాజు, బిజెడి రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రా, పలువురు మాజీ న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.

టిబితోనే అత్యధిక మరణాలు : డాక్టర్ నర్రెడ్డి సునీత

టిబితోనే అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని ప్రముఖ వైద్యురాలు నర్రెడ్డి సునీత తెలిపారు. జాతీయ పురస్కారం అందుకున్న తరువాత ఆమె మీడియాతో మాట్లాడారు. కరోనా సమయంలో టిబి, డెంగీ, హెచ్ఐవి లాంటి అంటువ్యాధుల విషయాన్ని అంతా విస్మరించారని తెలిపారు. టిబి వేల సంవత్సరాలుగా ఉన్నా నేటికీ చికిత్స అందించడం సవాల్‌గానే ఉందని అన్నారు. 15 ఏళ్ల క్రితంతో పోల్చితే ప్రస్తుతం టిబి చికిత్సలో ఎన్నో మార్పులు వచ్చాయని తెలిపారు. టిబి రోగులకు చేయూతనివ్వాల్సి ఉంటుందన్నారు. టిబి వ్యాప్తిని అరికట్టగలిగితే సమాజానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం డెంగీపై పరిశోధనలు సాగుతున్నాయన్నారు.

రష్యాతో చర్చలకు సంసిద్ధత తెలపండి

ఉక్రెయిన్‌కు అమెరికా విజ్ఞప్తి

న్యూయార్క్ : రష్యాతో శాంతి చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేయాలని ఉక్రెయిన్ అధికారులకు అమెరికా ప్రభుత్వం ప్రైవేటుగా విజ్ఞప్తి చేసింది. ఈ విషయాన్ని వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. ఉక్రెయిన్ నుంచి రష్యా దళాలను పూర్తిగా తొలగించే వరకూ రష్యాతో చర్చలు జరిపేది లేదని ఉక్రెయిన్ బహిరంగంగా ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. రష్యాతో చర్చలు అసాధ్యమని గత నెలలో ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీ ఒక డిక్రీ కూడా జారీ చేశారు. ఇలాంటి పట్టుదల వదిలివేయాలని, చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేయాలని ఉక్రెయిన్‌కు అమెరికా విజ్ఞప్తి చేసినట్లు ఈ విషయం గురించి తెలిసిన అధికారులు వెల్లడించారని వాషింగ్టన్ పోస్టు తెలిపింది. ఉక్రెయిన్‌ను యుద్ధానికి ప్రోత్సహించడం తమ లక్ష్యం కాదని, రష్యాతో వాస్తవ చర్చలు జరిపి, ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని ఉక్రెయిన్‌కు అమెరికా తెలిపినట్లు వాషింగ్టన్ పోస్టు తెలిపింది. గత కొన్ని నెలల నుంచి చర్చలకు రావాలని ఉక్రెయిన్ అధికారులను రష్యా పదేపదే ఆహ్వానిస్తుంది. 'అవతలి వైపు నుండి మాతో మాట్లాడటానికి కూడా సుముఖత లేనప్పుడు మేము ఏవైనా ఒప్పందాలను ఎలా చర్చించగలము?' అని పుతిన్ గత వారంలో పేర్కొన్నారు.

ఖెర్సాన్‌లోని డ్యామ్ లక్ష్యంగా ఉక్రెయిన్ క్షిపణి దాడులు

కీవ్ : ఖెర్సాన్ ప్రాంతంలోని కఖక్షవస్కయా హైడ్రోఎలక్ట్రిక్ డ్యామ్ లక్ష్యంగా ఆదివారం ఉక్రెయిన్ క్షిపణి దాడులు నిర్వహించింది. అమెరికా సరఫరా చేసిన హెచ్ఐఎంఎఆర్ఎస్ క్షిపణులు ఆరింటిని ఉక్రెయిన్ ప్రయోగించి నట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ దాడితో ఫ్లడ్‌గేట్స్‌లో ఒకటి నాశనమయిందని వెల్లడించింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో ఆరు క్షిపణులను ఉక్రెయిన్ ప్రయోగించిందని, వీటిల్లో ఐదు క్షిపణులను రష్యా ఎయిర్ డిఫెన్స్ నిరోధించిందని తెలిపింది. ఈ డ్యామ్ చుట్టూ ఉన్న ప్రజలను ఇప్పటికే రష్యా ఖాళీ చేయించింది.

5 కోట్ల కోవాగ్జిన్ డోసులు వృథా!

న్యూఢిల్లీ : రెండు డోసులు తీసుకున్న తర్వాత దేశవ్యాప్తంగా వాక్సిన్‌కు డిమాండ్ పడిపోయింది. భారత్‌లో ఐదు కోట్ల కోవాగ్జిన్ డోసుల తుది గడువు దగ్గర పడుతున్నా.. వాటిని తీసుకునేవారే లేరని, వ్యాక్సిన్ నిల్వలు భారత్ బయోటెక్ వద్ద పేరుకుపోయి ఉన్నాయని సమాచారం. వ్యాక్సిన్ కొనుగోలు డిమాండ్ పూర్తిగా పడిపోయిందని, తయారీ ఆపేస్తున్నామని ఈ ఏడాది మొదట్లోనే భారత్ బయోటెక్ ప్రకటించింది. 2021లో కరోనా రెండో వేవ్ ఉధృతస్థాయిలో వచ్చాక.. వ్యాక్సిన్ వాడకం పెరుగుతుందని కంపెనీ అంచనావేసింది. ఒక ఏడాదిలో దాదాపు వంద కోట్ల డోసులకు సరిపడా వ్యాక్సిన్ తయారు చేయగలమని కంపెనీ ప్రకటించింది. ఆమేరకు ఉత్పత్తి సామర్థ్యం పెంచామని తెలిపింది. "ప్రస్తుతం భారత్ బయెటెక్ వద్ద 20 కోట్లకుపైగా కోవాగ్జిన్ వ్యాక్సిన్ డోసుల నిల్వలున్నాయి. ఇందులో ఐదు కోట్ల డోసులు వాడకానికి సిద్ధం. కానీ డిమాండ్ పూర్తిగా పడిపోయింది. ఉత్పత్తి ఆపేయాలని కంపెనీ ఎప్పుడో నిర్ణయించింది"అని అ సంస్థ వర్గాలు వెల్లడించాయి.



మీకోసం

ఉల్లిపాయ ముక్కలు కోసిన తరువాత చేతులు వాసన వస్తుంటే నిమ్మరసం రాసుకుంటే సరి.

జీవన సౌరభం

వేచి వుంటే అవకాశాలు వస్తాయి. కాని అవి దూసుకుపోయే వాళ్లు వదిలేసినవి.

అల్లరి బాల్యం



భవిష్యత్తుకు పునాది బాల్యం
అల్లరితనం బాల్యం
అందమైనది బాల్యం
చిలిపితనం బాల్యం

ఎంతో చక్కనైనది
ఆనందాన్ని అందించేది
సంతోషంగా గడిపేది
ముద్దు మాటలతో మాట్లాడేది బాల్యం


చిన్ని చిన్ని అడుగులతో నడిచేది
ఆటపాటలతో కూడింది
అమ్మ ప్రేమతో నిండింది
నాన్న వేళ్ళు పట్టుకుని నడిచింది బాల్యం

అమ్మ గోరుముద్దలతో మురిసింది బాల్యం
అమ్మ మాట వినకుండా తిరిగింది బాల్యం
మనకు ఇష్టమైనది బాల్యం
మరచిపోలేనిది బాల్యం
నవ్వులతో నిండింది బాల్యం
ఎంతో సంతోషమైంది బాల్యం..



- నిఖిల్ జాన్, 7 వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి. గుంటూరుజిల్లా.

బొమ్మ గీయండి!



చిన్నారులూ , ఈ రోజు గొర్రెపిల్ల బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెలు ఆధారంగా బొమ్మ గీయండి.

నేను గీసిన బొమ్మ



-సయ్యద్ ముజఫర్,
4వ తరగతి,
శాంతినికేతన్ స్కూలు,,
అనంతసాగరం
నెల్లూరుజిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కష్టజీవుల వెతల కతలు..!

చుట్టూ విష వాయువులు కమ్మేస్తున్నా.. ఊపిరాడని పరిస్థితుల్లోనైనా.. పీకల్లోతూ గుంటల్లో.. మురికినీళ్లల్లో.. భయంకర పరిస్థితులెన్నింటినైనా తమ శ్రమతో ఎదిరిస్తారు వారు. పొట్టకూటి కోసం, బిడ్డలకు రెండు పూటలా తిండి పెట్టడం కోసం, ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని శ్రమచేస్తున్న వారెందరో.. అత్యంత కాలుష్య కారక నగరంగా మారిపోయిన ఢిల్లీ వీధుల్లో కాయకష్టం చేసుకునే శ్రమజీవులు వారిలో ఒకరు.

గత శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీ అత్యంత విషతుల్య గాలులతో నిండిపోయిందని ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నివేదిక ఇచ్చింది. ఆ గాలుల్లో ఆరోగ్యవంత వ్యక్తులు కూడా ఊపిరి తీసుకోవడం కష్టమని వీధుల్లో ఎవరూ తిరగొద్దని హెచ్చరించింది. ఢిల్లీ వాసులకు ఇదేమీ కొత్తకాదు. ప్రతి ఏడాది శీతాకాలం రాగానే ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరాల జాబితాలో ఢిల్లీ చేరుతుంది. ఈ నేపథ్యంలో ఇంటి నుంచే పనిచేయమని తమ అధికారులకు ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. ఈ వెసలుబాటు ఢిల్లీ ఉన్నత వర్గాలకు గొప్ప ఉపశమనం. మరి రోజువారీ పనులు చేసుకుంటూ జీవనోపాధి చేసుకునేవారి పరిస్థితి ఎలా ఉంది? వారి బాధలు ఎవరు పట్టించుకుంటారు?



'వయసు మీద పడిందని 2017లో డ్రైవరుగా పనిచేస్తున్న నన్ను కంపెనీ తొలగించింది. బతుకుదెరువు కోసం ఏదో ఒకటి చేయాలికదా! అప్పు చేసి ఓ ఆటో కొనుక్కున్నాను. ప్రతి ఏడాదీ కాలుష్య గాలులతో ఇదే పరిస్థితి ఉంటుంది. అయినా ఆటో నడపడం తప్పడం లేదు. బయటి గాలి ఎంత కాలుష్యంగా ఉంటుందంటే కళ్లు మంటలు పుట్టి నీళ్లు వస్తుంటాయి' అంటాడు గంగాప్రసాద్ మాలి (60). 'ఇక్కడ వాతావరణం చాలా విషతుల్యంగా ఉంటోంది. నేను స్కూలు పిల్లలను నా ఆటోలో దింపుతుంటాను. రోజురోజుకూ వాళ్లు నీరసంగా కనిపించేవారు. కొంతమంది వాంతులు చేసుకునేవారు. ఇప్పుడు స్కూళ్లు మూసేశారు. నేను మాత్రం కిరాయికి ఆటో నడుపుతున్నాను. ఇది తప్ప నాకు వేరే పనిలేదు' అంటున్నాడు బిహార్ నుంచి వచ్చిన మరో ఆటోడ్రైవరు గణేశ్.



'లాక్‌డౌన్ వల్ల పని పోయి చాలా ఇబ్బందులు పడ్డాం. మేము రోజూ దుమ్ములోనే పనిచేస్తాం. ఇప్పుడు ఈ కాలుష్యం వల్ల మా పనులు తాత్కాలికంగా మరోసారి ఆగిపోయాయి. పని చేస్తేనే మా పొట్ట నిండుతుంది. పని ఆపేయడం మాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. ఇప్పుడు ఏం చేయాలో తోచడం లేదు' అంటుంది భవన నిర్మాణరంగ కూలీ శిఖా మండల్ దిగులుగా ముఖంపెట్టి.



'నేను రోజుకి 12 నుంచి 14 గంటలు పనిచేయాలి. ఖాళీగా కూర్చొంటే కుటుంబం నడవదు. కాలుష్యంగా ఉందని ఇంట్లో కూర్చొని పని చేస్తే డబ్బులు వచ్చే ఉద్యోగం కాదిది. ఆర్డర్లు తీసుకుని సరఫరా చేయాలి. అలా చేస్తేనే మా కంపెనీ జీతం ఇస్తుంది. ఈ సమయంలో కంపెనీ ఎటువంటి వెసులుబాటు ఇవ్వలేదు. బయటికి వెళ్లకుండా ఉద్యోగం చేయలేం. తప్పదు' అంటున్నాడు డెలివరీ బాయ్ అమిత్ కుమార్ (39).



'వాతావరణం చాలా ఇబ్బందికరంగా ఉంది. కళ్లు మండుతున్నాయి. సాధారణంగా మేము పని చేసేటప్పుడు మెట్లు ఎక్కి దిగుతూ బరువులు మోస్తూ తిరగాలి. ఊపిరి ఆడడం లేదు. అయినా పనిచేయక తప్పదు' అంటున్నాడు పారిశుధ్య కార్మికుడు షాహ్ ఆలమ్.



'నేను వీధుల్లో తిరిగేటప్పుడు రోడ్డు కనిపించడం లేదు. దట్టమైన పొగ ఆవరించి ఉంటోంది. నా కళ్లు మండుతున్నాయి. నీళ్లు కారుతున్నాయి. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంది. చాలా అలసటగా అనిపిస్తోంది. కాని ఇల్లిళ్లుతిరుగుతూ ఉంటేనే పిల్లలకు రెండు పూటలా తిండిపెట్టగలం' అంటున్నాడు తోపుడుబండి మీద కూరగాయలు అమ్ముకునే దినేష్ కుమార్.

వీరంతా రోజూ మన చుట్టూ ఉండేవారే. మనలో ఒకరే.. ప్రాంతాలు వేరైనా.. మనుషులు వేరైనా.. అవే కష్టాలు... అవే బాధలు.. పొట్టకూటి కోసం పడరాని పాట్లు పడుతున్నాయీ వలస బతుకులు.

వినోదం కోసం.. విరామం ఎక్కువ..

తెలుగు సినిమా ఇండస్ట్రీలో గత కొంతకాలంగా ముఖ్యంగా రాజమౌళి తెరకెక్కించిన 'బాహుబలి' చిత్రం తరువాత వచ్చిన పెద్ద సినిమాలన్నీ చాలా కాలం పాటు షూటింగులు జరుపుకుంటున్నాయి. కోవిడ్ 19 కారణంగా మొదలైన లాక్‌డౌన్ ప్రభావం షూటింగులపై పడిందన్నది కాదనలేని నిజం. డేట్లు సర్దుబాటు కాక, అనివార్య కారణాలు, ఆర్థిక సమస్యలు, అనుకోని విపత్తులు వల్ల సినిమా చిత్రీకరణలు జాప్యం కావడం సాధారణంగా జరిగే విషయం. అయితే ఇప్పుడు మాత్రం గ్రాండ్ సినిమాగా తెరకెక్కించాలన్న ఒత్తిడి.. హీరో ఇమేజ్ దృష్ట్యా కథను మార్చిమార్చి రాసుకోవడం షూటింగుల ఆలస్యానికి ప్రధాన కారణంగా ముందుకొచ్చింది. ఈ మధ్యకాలంలో చాలా గ్యాప్ తరువాత వచ్చిన వరుస సినిమాలన్నీ పరాజయం కావడంతో దర్శకులపై, హీరోలపై ఆ ప్రభావం పడింది.








ప్రారంభం ఇలా..

కోవిడ్‌కు ముందు ఇండస్ట్రీ నుంచి చిన్నా, పెద్ద సినిమాలు కలిపి 2019లో 238, కోవిడ్ సమయానికి ముందు 2020లో 63, కోవిడ్ తగ్గుముఖం పట్టాక 2021లో 204 సినిమాలు విడుదలయ్యాయి.

రెమ్యునరేషన్లు, కాస్ట్యూమ్స్, ప్రయాణ ఖర్చులు, షూటింగ్ సామాగ్రితో పాటు ఇప్పుడు గ్రాఫిక్ విజువల్స్, వీఎఫ్ఎక్స్ సెట్టింగులు వంటివన్నీ సినిమాలో భాగం అవుతున్నాయి. 'విజువల్స్ ద్వారా ప్రతిదీ కమ్యూనికేట్ చేయడానికి ప్రయత్నిస్తాను' అనే రాజమౌళి 'ఈగ' సినిమా గ్రాండ్‌గా రావడం కోసం విజువల్ ఎఫెక్ట్స్ కోసం రెండేళ్ల సమయం తీసుకున్నారు. ఆ తరువాత 'బాహుబలి' చిత్రాన్ని రెండు భాగాలుగా 733 రోజుల్లో తెరకెక్కించారు. 2013లో మొదలైన 'బాహుబలి' ద బిగినింగ్ సినిమా 2015లో విడుదలైంది. అందులో జలపాత సన్నివేశానికి వీఎఫ్ఎక్స్ జోడించడం కోసం 109 రోజుల సమయం పట్టింది. ఎక్కువ రోజులు షూటింగు జరుపుకున్న తెలుగు సినిమాగా 'బాహుబలి' రికార్డు సృష్టించిందని కూడా ప్రకటించారు. ఇక రెండవ భాగం విడుదలవ్వడానికి మరో రెండేళ్లు పట్టింది. మొన్నీమధ్య విడుదలైన 'ఆర్ఆర్ఆర్' షూటింగు పూర్తవ్వడానికి 300 రోజులు పట్టింది. 2018లో ప్రకటించిన ఈ ప్రాజెక్టు 2022కి గాని రాలేదు. ఇప్పుడు రాజమౌళి మహేష్‌బాబుతో ప్రకటించిన సినిమా 2023గాని పట్టాలెక్కదు. పూర్తయ్యేదెప్పటికో...




సినిమా ఫలితాలు ఎలా ఉన్నా ఈ ఒరవడి ఇండస్ట్రీ ఇతర పెద్ద సినిమా దర్శకులపై పెద్ద ఒత్తిడే తెచ్చిపెట్టింది. అందుకే పెద్ద హీరోలతో ప్రకటించిన సినిమాలు పట్టాలెక్కిన తరువాత కూడా మార్పులుచేర్పులు అంటూ కాలయాపన చేస్తున్నారు. బడా నిర్మాతలు, నిర్మాణసంస్థలు కూడా 'బడ్జెట్ ఎంతైనా పరవాలేదు.. సినిమా బాక్సాఫీసు బద్దలు కొట్టాలి అన్నట్లుగా ఒత్తిడి తెస్తున్నారు. అందుకే 2017 ఏప్రిల్‌లో మొదలుపెట్టి 2018 మార్చి నాటికి విడుదల చేసిన 'రంగస్థలం' సినిమా దర్శకుడు సుకుమార్ 2020లో ప్రకటించిన 'పుష్ప' సినిమాకు చాలా సమయం తీసుకున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతుందని ప్రకటించిన ఈ సినిమా మొదటి భాగం 2021 ఆగస్టులో విడుదల వాయిదా పడి ఆ ఏడాది డిసెంబరు నాటికి గాని థియేటర్లలో రాలేదు. పార్ట్ 2 ఈ ఏడాది డిసెంబరుకు విడుదల చేస్తామని ప్రకటించారు. ఇప్పటికి నాలుగు వారాల సమయమే ఉన్నా ఇంతవరకు తాజా సమాచారం ప్రకటించలేదు.

చిరంజీవి, రామ్‌చరణ్ ప్రధాన తారాగణంగా కొరటాల శివ తెరకెక్కించిన 'ఆచార్య' చిత్రాన్ని 2019లో ప్రకటించి 2022లో విడుదల చేశారు. లాక్‌డౌన్ వల్ల షూటింగు వాయిదా పడడం ఒక ఎత్తయితే సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయాలన్న పెద్దల ఒత్తిడి కొరటాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్నది సినిమా ఫలితాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇక చాలా తక్కువ సమయంలోనే సినిమాలు పూర్తిచేస్తారన్న పూరీ జగన్నాధ్ 'లైగర్' సినిమాకు చాలా ఎక్కువ సమయమే తీసుకున్నారు.

తాజా ప్రకటనలు లేవు..

రామ్‌చరణ్, శంకర్ కాంబినేషన్‌లో ప్రకటించిన ఇంకా పేరు పెట్టని 'ఆర్‌సి 15' 2021లో ప్రకటించి 2023 ద్వితీయార్ధానికి విడుదల చేస్తామని ప్రకటించారు. అలాగే జూనియర్ ఎన్‌టిఆర్, కొరటాల ప్రాజెక్టు ఈ ఏడాది మేలో ప్రకటించి వచ్చే ఏడాది 2023 మార్చి నాటికి విడుదల చేస్తామంటున్నారు. ప్రభాస్‌తో నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న సినిమా ప్రకటించి ఇప్పటికి రెండేళ్లు పూర్తవుతోంది. మరో రెండేళ్లకు అంటే 2024 విడుదల తేదీ ఇచ్చారు. జెర్సీ సినిమా తెరకెక్కించిన గౌతమ్ తిన్ననూరి రామ్‌చరణ్‌తో ప్రకటించిన 'ఆర్‌సి-16' ప్రాజెక్టు ఇంకా పట్టాలెక్కక ముందే ఆగిపోవడానికి కారణం బయటికి చెప్పకపోయినా 'ఆర్ఆర్ఆర్' ముందు విన్న కథలో మార్పులు చేయాలని పట్టుబడడమేనని అనధికార సమాచారం. ఆచీతూచీ అడుగులు వేయడం సరైనదే.. అయితే విరామం ఎంత తీసుకున్నా వినోదం లేకపోతే ఫలితం యథాతథమే..



చితక్కొట్టి సెమీస్‌కు..



జింబాబ్వేపై భారత్ ఘన విజయం

- సూర్యకుమార్, రాహుల్ అర్థ సెంచరీలు
- గ్రూప్-2లో అగ్రస్థానం సైతం సొంతం

మెల్‌బోర్న్ : సూర్యకుమార్ యాదవ్ (61 నాటౌట్, 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెఎల్ రాహుల్ (51, 35 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగగా..రవిచంద్రన్ అశ్విన్ (3/22), మహ్మద్ షమి (2/14) వికెట్ల వేటలో విజృంభించారు. కిక్కిరిసిన మెల్‌బోర్న్ మైదానంలో అటు బ్యాట్‌తో, ఇటు బంతితో తిరుగులేని ప్రదర్శన చేసిన టీమ్ ఇండియా 71 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. సూపర్12 గ్రూప్-2 చివరి మ్యాచ్‌లో ఏకపక్ష విజయం నమోదు చేసిన భారత్ గ్రూప్‌లో అగ్రస్థానంలో సెమీఫైనల్లోకి చేరుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 186 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఛేదనలో జింబాబ్వే 17.2 ఓవర్లలోనే చేతులెత్తేసింది. 115 పరుగులకే కుప్పకూలింది. 'సూర్యకుమార్ యాదవ్' మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

సూర్య..సూపరో సూపర్ : టాస్ నెగ్గిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు ఆశించిన ఆరంభాన్ని ఇవ్వలేదు. తొలి తొమ్మిది బంతులకు భారత్ పరుగుల ఖాతా తెరువనేలేదు. పవర్‌ప్లేలో భారత్‌కు నిరాశే ఎదురైంది. రోహిత్ శర్మ (15) వికెట్ చేజార్చుకున్నాడు. ఈ సమయంలో విరాట్ కోహ్లి (26, 25 బంతుల్లో 2 ఫోర్లు), కెఎల్ రాహుల్ (51) రెండో వికెట్‌కు అర్ధ సెంచరీ భాగస్వామ్యం నమోదు చేశారు. వేగంగా ఆడలేకపోయిన విరాట్ డగౌట్‌కు చేరుకోగా.. అక్కడి నుంచి సూర్యకుమార్ షో మొదలైంది. ఓ ఎండ్‌లో రాహుల్ పర్వాలేదనిపించగా, సూర్య విధ్వంసం సృష్టించాడు. 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ నమోదు చేశాడు. పెద్ద బౌండరీల మెల్‌బోర్న్‌లో పేసర్లు ఆఫ్‌సైడ్ వైడ్ బంతులేసినా.. లెగ్ సైడ్ సిక్సర్లు సంధించిన సూర్య కుమార్ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 25 బంతుల్లోనే అజేయంగా 61 పరుగులు సాధించాడు. 34 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన రాహుల్ వెంటనే డగౌట్‌కు చేరుకోగా.. హార్దిక్ పాండ్య (18, 18 బంతుల్లో 2 ఫోర్లు) ఆశించిన వేగంగా ఆడలేదు. ఇతర బ్యాటర్లు తేలిపోయిన చోట.. సూర్య మరోసారి స్పెషల్ ఇన్నింగ్స్ ఆడాడు. భారత్‌కు 186 పరుగుల భారీ స్కోరు అందించాడు.

బౌలర్లు భళా : పొట్టి ప్రపంచకప్‌లో భారత బౌలర్లు తొలిసారి ప్రత్యర్థిని ఆలౌట్ చేశారు. పేసర్లు భువనేశ్వర్ , అర్షదీప్ సింగ్, మహ్మద్ షమి నిప్పులు చెరిగే బంతులు సంధించటంతో జింబాబ్వే టాప్ ఆర్డర్ బెంబేలెత్తింది. వెస్లీ (0), క్రెయిగ్ (13), రేగిస్ (0), సీన్ విలియమ్స్ (11), టోనీ (5)లు ఆరంభంలోనే వికెట్ కోల్పోయారు. 36 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన జింబాబ్వేను.. సికందర్ రజా (34, 24 బంతుల్లో 3 ఫోర్లు), రియాన్ బర్ల్ (35, 22 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకునే ప్రయత్నం చేశారు. మిడిల్ ఆర్డర్‌లో విలువైన భాగస్వామ్యం నమోదు చేశారు. కానీ భారత బౌలర్ల దాడికి దాసోహం అవ్వక తప్పలేదు. అశ్విన్ మూడు వికెట్లు కూల్చగా, షమి రెండు వికెట్లు పడగొట్టాడు.

ఇంగ్లాండ్‌తో సెమీస్‌కు సై

2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్ సూపర్12 సమరం ముగిసింది. ఆదివారం గ్రూప్-2లో మూడు మ్యాచులతో ఈ అంకానికి తెరపడింది. బుధవారం (నవంబర్ 9) నుంచి సెమీఫైనల్ సమరం షురూ కానుంది. గ్రూప్-1 నుంచి న్యూజిలాండ్, ఇంగ్లాండ్ సెమీస్‌కు చేరుకోగా.. గ్రూప్-2 నుంచి భారత్, పాకిస్థాన్‌లు అర్హత సాధించాయి. తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్, పాకిస్థాన్ (సిడ్నీ) తలపడనున్నాయి. రెండో సెమీఫైనల్లో (నవంబర్ 10) భారత్, ఇంగ్లాండ్‌లు ఆడిలైడ్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. టైటిల్ పోరు నవంబర్ 13న మెల్‌బోర్న్‌లో జరుగనుంది. సెమీఫైనల్స్ సహా ఫైనల్స్‌కు రిజర్వ్ డే సదుపాయం ఉంది. వర్షం కారణంగా మ్యాచ్‌కు ఆటంకం కలిగితే.. తర్వాతి రోజున మ్యాచ్‌ను కొనసాగిస్తారు.

సెమీస్‌లో పాక్

ఆడిలైడ్ : దక్షిణాఫ్రికా పరాజయం.. పాకిస్థాన్‌కు వరమైంది. ఆశల్లేని ప్రపంచకప్‌లో పాక్ ఏకంగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బంగ్లాదేశ్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపొందిన పాకిస్థాన్ గ్రూప్-2లో మూడో విజయంతో (ఆరు పాయింట్లు) సెమీస్ బెర్త్ సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 127 పరుగులు చేసింది. నజ్ముల్ (54, 48 బంతుల్లో 7 ఫోర్లు), సర్కార్ (20), అఫిఫ్ (24)లు రాణించారు. షకిబ్ (0)ను థర్డ్ అంపైర్ ఎల్బీ అవుట్ ఇవ్వటం మ్యాచ్‌లో వివాదాస్పదమైంది. నాటౌట్ అని స్పష్టంగా కనిపిస్తున్నా మూడో అంపైర్ ఈ తప్పిదం చేయటం సర్వత్రా చర్చనీయాంశమైంది. స్వల్ప లక్ష్యాన్ని పాకిస్థాన్ 5 వికెట్లు కోల్పోయి 18.1 ఓవర్లలోనే ఛేదించింది. మహ్మద్ హారీశ్ (31), మసూద్ (24), రిజ్వాన్ (32), బాబర్ (25) రాణించారు. షహీన్ షా అఫ్రిది (4/22) 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

మాజీ క్రికెటర్ సయ్యద్ హైదర్ అలీ మృతి

న్యూఢిల్లీ : దేశవాళీ మాజీ క్రికెటర్, రైల్వేస్ జట్టుకు గాడ్‌ఫాదర్‌గా పేర్కొనే సయ్యద్ హైదర్ అలీ శనివారం ప్రయాగ్‌రాజ్‌లో కన్నుమూశారు. 79 ఏళ్ల అలీ గత కొంతకాలం నుంచి వయసుకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. 1963-64లో రైల్వే జట్టు తరుపున తన తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడారు. సుమారు 25 ఏళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో ఆడారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 113 ఫస్ట్‌క్లాస్ క్రికెట్ మ్యాచ్‌ల్లో 366 వికెట్లు సాధించారు. బంతితోపాటు బ్యాటింగ్‌లోనూ రాణించారు.

సఫారీలు చేజేతులా..!

- **నెదర్లాండ్స్ చేతిలో ఓటమి**

ఆడిలైడ్ : ఐసీసీ ప్రపంచ టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ బెర్త్ చేతుల్లో ఉండగా.. సఫారీలు స్వయంకృతంతో వదిలేశారు. ఆడిలైడ్‌లో ఆదివారం నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా అనూహ్య పరాజయం చవిచూసింది. సంచలన ప్రదర్శన చేసిన డచ్ ఆటగాళ్లు 13 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించారు. తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 158 పరుగులు చేసింది. స్టీఫెన్ (37, 30 బంతుల్లో 7 ఫోర్లు), మాక్స్ (29, 31 బతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), టామ్ కూపర్ (35, 19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కొలిన్ అకర్‌మ్యాన్ (41 నాటౌట్, 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా అనూహ్య పరాజయం పాలైంది. డికాక్ (13), బవుమా (20), రొసో (25), మార్క్రరం (17), క్లాసెన్ (21)లు మంచి ఆరంభాలను ఇచ్చారు. కానీ వాన్‌డర్ మెర్వె కండ్లుచెదిరే క్యాచ్‌తో మిల్లర్ ఇన్నింగ్స్ ముగియగా... అక్కడ్నుంచి మ్యాచ్‌పై డచ్ జట్టు పట్టు బిగించింది. 20 ఓవర్లలో 8 వికెట్లకు సఫారీలు 145 పరుగులే సాధించారు. డచ్ బౌలర్లలో గ్లోవర్ (3/9), క్లాసెన్ (2/20), లీడె (2/25)లు రాణించారు. సంచలన విజయం నమోదు చేసిన నెదర్లాండ్స్.. తర్వాతి టీ20 ప్రపంచకప్‌కు నేరుగా సూపర్12 దశకు అర్హత సాధించింది. బంగ్లాదేశ్, అఫ్గనిస్థాన్, జింబాబ్వే సహా ఐర్లాండ్‌లు అర్హత టోర్నీ ఆడాల్సి ఉంటుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68